epaper.samayamdaily.net
APTEL/26/A3949
S TV SAMAYAM
# సమయం
మన గొంతుకే.. మన పత్రిక
తెలుగు దినపత్రిక

సమయం
మన గొంతుకే.. మన పత్రిక
తెలుగు దినపత్రిక
విలేకరులు కావలెను
తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.
7036644111, 9490140565

సంపుటి: 1 | సంచిక: 60 | ఎడిటర్ : అలీ ముర్తుజా | మంగళవారం 1 సెప్టెంబర్ 2026 | ప్రచురణ : విజయవాడ | పేజీలు: 8 | వెల: రూ.5 |

## వెలిగొండ ఘనత వైఎస్సార్‌దే!

బాబుది కేవలం ప్రచార ఆర్భాటమే



- ప్రాజెక్టును జాతికి అంకితం చేసింది జగనే
- బహిరంగ చర్చకు సిద్ధమన్న అప్పిరెడ్డి, సుధాకర్ బాబు

3



30 ఏళ్ల కల సాకారం..

నల్లమల సాగర్ వైపు పరవళ్లు

- కృష్ణా జలాలకు సీఎం చంద్రబాబు సాష్టాంగ నమస్కారం
- 1.19 లక్షల ఎకరాలకు సస్యశ్యామలం
- నిర్వాసితుల త్యాగాలకు పాదాభివందనం
- 2028లో మార్కాపురంలో కృష్ణా పుష్కరాలు



# కరువు నేలకు కృష్ణమ్మ

వెలిగొండ ప్రాజెక్టు తొలిదశను ప్రారంభించిన ముఖ్యమంత్రి

**మార్కాపురం (సమయం న్యూస్):** మూడు దశాబ్దాలుగా ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల ప్రజలు కంటున్న పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు కల ఎట్టకేలకు సాకారమైంది. ప్రాజెక్టు తొలిదశను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం జాతికి అంకితం చేశారు. దొర్నాల మండలం గంటవానిపల్లె వద్ద నల్లమల కొండల్లోని జంట సొరంగాల నుంచి వెలువడిన కృష్ణా జలాలకు ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి జలహారతి ఇచ్చారు. కరవు నేలను తాకిన కృష్ణమ్మకు సాష్టాంగ నమస్కారం చేశారు. శ్రీశైలం జలాశయంలోని కొల్లం వాగు నుంచి గ్రావిటీ ద్వారా తరలించిన జలాలు వెలిగొండ జంట సొరంగాల మీదుగా

మిగతా 2 లో



## దశాబ్దాల కల నెరవేరింది!

వెలిగొండ ప్రారంభంపై పవన్ కల్యాణ్ హర్షం
'ఎక్స్' వేదికగా ఉప ముఖ్యమంత్రి స్పందన

2

## రైతు బతుకుల్లో కొత్త వెలుగు!

సీఎం చంద్రబాబును కొనియాడిన మంత్రులు అచ్చెన్న, అనిత

## ఏపీ సిట్‌పై సుప్రీం సీరియస్!

రెండేళ్లుగాపళ్లుగా ఏం చేస్తున్నారు?
మద్యం కేసు దర్యాప్తు తీరుపై తీవ్ర అసహనం
కస్టడీ కోరే విధానం ఇదేనా అని ప్రశ్న
రాజ్ కేశిరెడ్డి, వాసుదేవరెడ్డికి నోటీసులు

3




## తిరుమలగిరిపై బ్రహ్మోత్సవాల కోలాహలం!

ఉత్సవాలకు ముస్తాబైన ఏడుకొండలు

- 8న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, 14న అంకురార్పణ
- 15న ధ్వజారోహణంతో మొదలు.. 23న చక్రస్నానంతో ముగింపు

3





## మోదీ-పుతిన్ కీలక భేటీ

- వాణిజ్యం నుంచి రక్షణ వరకు విస్తృత చర్చలు
- ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్‌తోనూ భేటీ

4

## విశాఖ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం!

- దేశంలో నంబర్ వన్ సిటీగా నిలబెడతామన్న మంత్రి లోకేష్
- పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం
- 2 వేల కోట్ల పెట్టుబడితో ఏఐజీ హాస్పిటల్స్
- రోశయ్య విగ్రహానికి ది స్టాట్యూ ఆఫ్ స్టేట్స్‌మన్ అని పేరు

3



## పట్టాలపై మృత్యువు!




రైలు ఢీకొని ముగ్గురి దుర్మరణం
మృతులు ఏపీలోని హిందూపురం వాసులు

3

## బాణాసంచా కర్మాగారంలో పేలుడు

11 మంది దుర్మరణం



.. వివరాలు 4లో



## జర్నలిస్టులకు ప్రమాద బీమా!

20 వేల మందికి లబ్ధి : మంత్రి పార్థసారథి

2

# దశాబ్దాల కల నెరవేరింది!

**వెలిగొండ ప్రారంభంపై పవన్ కల్యాణ్ హర్షం**

**'ఎక్స్' వేదికగా ఉప ముఖ్యమంత్రి స్పందన**

**7,300 మంది నిర్వాసితులకు ప్రత్యేక కృతజ్ఞతలు**

**సీఎం చంద్రబాబు దార్శనికతపై ప్రశంసలు**

**అమరావతి (సమయం న్యూస్):** దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు తొలి దశ ప్రారంభం కావడంపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. నల్లమల కొండలను చీల్చుకుంటూ కృష్ణా జలాలు కరువు ప్రాంతాలకు చేరనున్న ఈ చారిత్రక



ఘట్టాన్ని స్వాగతిస్తున్నట్లు ఆయన 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుతో మార్కాపురం, ప్రకాశం, కడప, నెల్లూరు జిల్లాల ప్రజల సాగు, తాగునీటి కల నెరవేరిందని సంతోషం వ్యక్తం చేశారు. తొలి దశ ద్వారా 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు, 4 లక్షల మందికి తాగునీరు అందనుందని పవన్ తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణం కోసం ఇళ్లు, భూములు త్యాగం చేసిన 7,300 మందికి పైగా నిర్వాసితులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వీరికి పరిహారం కింద కూటమి ప్రభుత్వం 905 కోట్లు విడుదల చేయగా, ఇప్పటికే 768 కోట్లు చెల్లించిందని గుర్తుచేశారు. 1996లో అప్పటి ముఖ్యమంత్రిగా చంద్రబాబు శంకుస్థాపన చేసిన ఈ ప్రాజెక్టు.. నేడు ఆయన చేతుల మీదుగానే ప్రారంభం కావడం విశేషమన్నారు. ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు అందించాలన్న ప్రధాని నరేంద్ర మోదీ సంకల్ప సాధనలో ఈ ప్రాజెక్టు కీలక పాత్ర పోషిస్తుందని స్పష్టం చేశారు. ప్రాజెక్టును వేగంగా అందుబాటులోకి తెచ్చిన జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, అధికారులను పవన్ ప్రత్యేకంగా అభినందించారు.

# కరువు నేలకు కృష్ణమ్మ!

(మొదటి పేజీ తరువాయి..)

గంటవానిపల్లెకు చేరుకుని నల్లమల సాగర్ వైపు పరుగులు తీశాయి. కాలువల్లో ప్రవహించిన కృష్ణమ్మకు మహిళలు పూలతో ఘన స్వాగతం పలికారు. 1996 మార్చి 5న ముఖ్యమంత్రిగా తానే ఈ ప్రాజెక్టుకు భూమిపూజ చేశానని, సరిగ్గా 30 ఏళ్ల తర్వాత 2026 ఆగస్టు 31న తొలిదశను ప్రారంభించడం తన జీవితంలో భావోద్వేగ సందర్భమని చంద్రబాబు పేర్కొన్నారు. నాడు చేసిన సంకల్పం నేడు జలసిరిగా మారిందన్నారు. కొండలు అడ్డు వచ్చినా తొలిచి మరీ కరవు నేలకు నీళ్లు తీసుకొచ్చామన్నారు. ప్రాజెక్టు కోసం భూములు, ఇళ్లు త్యాగం చేసిన 11 గ్రామాల ప్రజలకు ఆయన పాదాభివందనం చేశారు. కేవలం 48 రోజుల్లో 6,206 నిర్వాసిత కుటుంబాలకు 768 కోట్ల పరిహారం అందించామని, వారి అవసరాలను గుర్తించి అదనంగా మరో 169 కోట్లు చెల్లిస్తున్నామని వివరించారు. 18 ఏళ్లు నిండిన యువతకు తలా 2 లక్షల చొప్పున సాయం అందజేశామన్నారు. 10,200 కోట్ల అంచనాతో చేపట్టిన ఈ ప్రాజెక్టులో ఇప్పటివరకు 7,983 కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించారు.

## ఫ్లోరైడ్ కష్టాలకు శాశ్వత చెక్

తొలిదశ కింద 10.70 టీఎంసీల నీటిని తరలించి 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు, 4 లక్షల మందికి తాగునీరు అందిస్తున్నట్లు సీఎం తెలిపారు. ప్రాజెక్టు పూర్తిగా పూర్తయితే ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని 30 మండలాల్లో దాదాపు 4.47 లక్షల ఎకరాలకు సాగునీరుతో పాటు 23 లక్షల



మందికి తాగునీరు అందుతుందని స్పష్టం చేశారు. ప్రకాశం జిల్లాలో 3.36 లక్షల ఎకరాలు, నెల్లూరు జిల్లాలో 84 వేల ఎకరాలు, కడప జిల్లాలో 27 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. కృష్ణా జలాల రాకతో పశ్చిమ ప్రకాశంలో ఫ్లోరైడ్ అనేది గత చరిత్రగా మిగిలిపోతుందని భరోసా ఇచ్చారు.

## గత పాలకుల మోసాలు

2019లో అధికారంలోకి వచ్చిన గత ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టుకు గ్రహణం పట్టిందని చంద్రబాబు విమర్శించారు. నిర్వాసితులకు అరకొర చెల్లింపులు చేశారని మండిపడ్డారు. పనులు పెండింగ్ లో ఉండగానే జాతికి అంకితం చేశామని ప్రకటించి ప్రజలను దారుణంగా మోసం చేశారని ధ్వజమెత్తారు. సొరంగాల్లో యంత్రాలు ఇరుక్కుపోవడం వల్ల పనులు పూర్తి కాలేదని, కూటమి సర్కారు రాగానే ఆ సమస్యలు పరిష్కరించి నీటిని అందించామని చెప్పారు. అబద్ధపు ప్రచారాలతో కాలం వెళ్లదీసిన వారిని ఈ ప్రాంత ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు. వెలిగొండ రెండో దశను 2028 నాటికి పూర్తి చేసే బాధ్యతను కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని ముఖ్యమంత్రి ప్రకటించారు. అదే ఏడాది జరిగే కృష్ణా పుష్కరాలను మార్కాపురంలోనూ అత్యంత వైభవంగా నిర్వహిస్తామన్నారు. రాబోయే 3 ఏళ్లలో 36 సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసేలా ఇరిగేషన్ క్యాలెండర్ రూపొందించామని చెప్పారు. 2027 మార్చి నాటికి పోలవరం పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు. నదుల అనుసంధానంతోనే దేశం సుభిక్షంగా మారుతుందని ఆయన ఆకాంక్షించారు. గోదావరి జలాలను పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లికి, ఆపై వంశధార వరకు తరలించేలా కృషి చేస్తున్నట్లు వివరించారు.

## ఆకట్టుకున్న పంచెకట్టు

ఈ కార్యక్రమానికి అచ్చమైన తెలుగు సంప్రదాయ పంచెకట్టులో విచ్చేసిన ముఖ్యమంత్రికి గిరిజన మహిళలు సంప్రదాయ నృత్యాలతో స్వాగతం పలికారు. దివంగత పూల సుబ్బయ్య కుటుంబ సభ్యులను సీఎం ఆత్మీయంగా సత్కరించారు. ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచిన అధికారులను, జల వనరుల శాఖ మంత్రి రామానాయుడును ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, నారాయణ, కందుల దుర్గేష్, కొలుసు పార్థసారథి, అనగాని సత్యప్రసాద్, గుమ్మిడి సంధ్యారాణి, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతు బతుకుల్లో కొత్త వెలుగు!

**వెలిగొండతో సాగు, తాగునీటి కష్టాలకు చెక్**

**30 ఏళ్ల కలను సాకారం చేసిన ముఖ్యమంత్రి**

**48 రోజుల్లోనే నిర్వాసితులకు 762 కోట్ల పరిహారం**

**సీఎం చంద్రబాబును కొనియాడిన మంత్రులు అచ్చెన్న, అనిత**





**అమరావతి (సమయం న్యూస్):** వెలిగొండ ప్రాజెక్టుతో కరువు ప్రాంతాల రైతుల జీవితాల్లో కొత్త వెలుగులు వచ్చాయని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు హర్షం వ్యక్తం చేశారు. కరువు సీమ భవిష్యత్తును మార్చే చారిత్రక ఘట్టంగా వెలిగొండ ప్రారంభోత్సవాన్ని ఆయన అభివర్ణించారు. సోమవారం అమరావతిలో ఆయన మాట్లాడుతూ.. 30 ఏళ్ల ప్రాజెక్టు కలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సాకారం చేశారని కొనియాడారు. 1996లో ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన ఆయన చేతుల మీదుగానే ఇది జాతికి అంకితం కావడం చారిత్రాత్మకమన్నారు. సాగునీటి ప్రాజెక్టుల పూర్తిపై సీఎం తీసుకుంటున్న చొరవకు ఇది నిలువెత్తు నిదర్శనమని ప్రశంసించారు.

## వలసలకు శాశ్వత పరిష్కారం

ఈ ప్రాజెక్టు ద్వారా 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు, ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాల్లోని లక్షలాది మందికి తాగునీరు అందుతుందని అచ్చెన్నాయుడు వివరించారు. ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల రైతులకు ఇది వరప్రదాయిని అని స్పష్టం చేశారు. కృష్ణా వరద జలాల మళ్లింపుతో భూగర్భ జలాలు పెరిగి, వ్యవసాయానికి కొత్త ఊపు వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కరువుతో జరిగే వలసలకు వెలిగొండ జీవరేఖగా మారుతుందన్నారు. నిర్వాసిత కుటుంబాల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇచ్చిందని, కేవలం 48 రోజుల్లోనే వారికి 762 కోట్ల పరిహారం అందించడం సీఎం చిత్తశుద్ధికి అద్దం పడుతోందని తెలిపారు.

## అపర భగీరథుడు సీఎం బాబు

కరువు నేలకు కృష్ణా జలాలను తీసుకొచ్చిన సీఎం చంద్రబాబు అపర భగీరథుడని హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత విశాఖపట్నంలో కొనియాడారు. 30 ఏళ్లుగా ఎదురుచూస్తున్న కల ఆయన దార్శనికతతోనే నెరవేరిందన్నారు. ఈ ప్రాజెక్టు ప్రారంభోత్సవం ముఖ్యమంత్రి పట్టుదలకు నిదర్శనమని ప్రశంసించారు. అలాగే పోలవరం ఎడమ కాలువ ద్వారా నీటి విడుదల ఉత్తరాంధ్ర రైతులకు ఎంతో మేలు చేస్తుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు తీసుకొస్తున్న ముఖ్యమంత్రికి ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# లారీని ఢీకొని ప్రమాదానికి గురైన కారు

**మంటలు చెలరేగడంతో డ్రైవర్ సజీవ దహనం**

**విశాఖపట్నం,ఆగస్ట్31:** విశాఖ జిల్లాలోని ఆనందపురం–పెందుర్తి సర్వీస్ రోడ్డులో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. గండిగుండం సత్తరువు కూడలి వద్ద ఓ కారు అదుపుతప్పి లారీని ఢీకొట్టింది. ప్రమాదం జరిగిన వెంటనే కారులో మంటలు చెలరేగి క్షణాల్లోనే వాహనం పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న డ్రైవర్ మంటల్లో చిక్కుకుని సజీవ దహనమైనట్లు సమాచారం. ప్రమాద తీవ్రతకు కారు పూర్తిగా కాలిపోవడంతో ఘటనాస్థలంలో భయానక పరిస్థితి నెలకొంది. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మంటలను అదుపులోకి తీసుకువచ్చి, ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు. ఇదిలా ఉండగా.. ప్రమాదం అనంతరం లారీకి చిక్కుకున్న నంబర్ ప్లేట్ ఆధారంగా మృతుడి వివరాలను గుర్తించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

# పర్యాటక కేంద్రంగా వెలిగొండ!

- సీఎం చేతుల మీదుగా టూరిజం బ్రోచర్ ఆవిష్కరణ
- నల్లమల, కంభం, భైరవకోనతో సర్క్యూట్
- వెల్లడించిన మంత్రి కందుల దుర్గేష్

**మార్కాపురం (సమయం న్యూస్):** వెలిగొండను కేవలం సాగునీటి ప్రాజెక్టుగానే కాకుండా ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. గంటవానిపల్లి సమీపంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా సోమవారం జరిగిన ప్రాజెక్టు తొలి దశ నీటి విడుదల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీశైలం, మార్కాపురం, కంభం తదితర ప్రాంతాల టూరిజం సర్క్యూట్ ప్రణాళికకు సంబంధించిన బ్రోచర్‌ను సీఎం చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు.

1996లో ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన చంద్రబాబు.. మళ్లీ ముఖ్యమంత్రి హోదాలో తొలి దశను ప్రారంభించడం




చారిత్రక ఘట్టమని దుర్గేష్ కొనియాడారు. నిర్వాసితులకు నీటి విడుదలకు ముందే పరిహారం అందించడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. కేరళలో చికిత్స పొందుతూనే వీడియో ద్వారా ఈ వేడుకను వీక్షించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

శ్రీశైలం మల్లన్న క్షేత్రం, నల్లమల అడవులు, కంభం చెరువు, భైరవకోన, నల్లమల ఫారెస్ట్ సఫారీ, మార్కాపురం చెన్నకేశవస్వామి ఆలయం, త్రిపురాంతకం ప్రాంతాలను కలుపుతూ ప్రత్యేక టూరిజం సర్క్యూట్ ఏర్పాటు చేస్తామని మంత్రి ప్రకటించారు. దీనివల్ల స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని స్పష్టం చేశారు. కరువు నేల దాహార్తి తీరుస్తున్న సీఎం చంద్రబాబుకు, జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# జర్నలిస్టులకు ప్రమాద బీమా!

**మరణిస్తే కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం**

**20 వేల మందికి లబ్ధి: మంత్రి పార్థసారథి**

**ప్రభుత్వ నిర్ణయంపై సంఘాల హర్షం**



**విశాఖపట్నం (సమయం న్యూస్):** రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులకు ప్రమాద బీమా పాలసీని పునరుద్ధరించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి వెల్లడించారు. ఈ ఫైలుకు ఆర్థిక శాఖ నుంచి కూడా అనుమతి లభించిందని, త్వరలోనే పాలసీ అమల్లోకి రానుందని తెలిపారు. ఈ నిర్ణయం వల్ల రాష్ట్రవ్యాప్తంగా అక్రిడిటేషన్ కలిగిన సుమారు 20 వేల మంది జర్నలిస్టులకు లబ్ధి చేకూరుతుందని చెప్పారు.

బీమా పరిధిలో ఉన్న జర్నలిస్టు ప్రమాదవశాత్తూ మరణిస్తే వారి కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక పరిహారం అందుతుందని మంత్రి వివరించారు. గత ప్రభుత్వం బీమా పాలసీని పట్టించుకోకపోవడం వల్ల జర్నలిస్టులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తుచేశారు. జర్నలిస్టులంతా ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ నివాస స్థలాలు మంజూరు చేసేందుకు కూడా ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని ఆయన భరోసా ఇచ్చారు.

జర్నలిస్టుల వినతులపై సానుకూలంగా స్పందించి బీమా పాలసీని పునరుద్ధరించినందుకు జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మంత్రి పార్థసారథికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్టుల సంఘం, స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రభుత్వ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తూ మంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు.

# జగన్ రాకతో వెలిగొండకు గ్రహణం!

- సుమారు 2 వేల కోట్ల పనులు పెండింగ్ ఉన్నా నాడు నకిలీ ప్రారంభోత్సవం
- కూటమి సర్కారుతోనే పూర్తి స్థాయిలో ప్రాజెక్టు పనులు
- గత ప్రభుత్వ తీరును ఎండగట్టిన మంత్రి నిమ్మల రామానాయుడు

**మార్కాపురం (సమయం న్యూస్):** వైఎస్ జగన్ అధికారంలోకి రావడంతోనే వెలిగొండ ప్రాజెక్టుకు గ్రహణం పట్టిందని జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్రంగా విమర్శించారు. మార్కాపురంలో నిర్వహించిన ప్రాజెక్టు తొలి దశ ప్రారంభోత్సవ సభలో ఆయన ప్రసంగించారు. 2019 నుంచి 2024 మధ్య కాలంలో ప్రాజెక్టు పేరుతో గత ప్రభుత్వం చేసిన మోసాలను ఎండగట్టారు.

రెండో సొరంగంలో కనీసం యంత్రాన్ని బయటకు తీసే ప్రయత్నం చేయకుండా, సుమారు 2 వేల కోట్లకు పైగా పనులు పెండింగ్ లో ఉండగానే జగన్ నకిలీ ప్రారంభోత్సవ డ్రామాలు ఆడారని మండిపడ్డారు. పూర్తిగా తవ్వని సొరంగంలో తివాచీలు వేసుకుని నడిచిన ఆయన.. ప్రాజెక్టును జాతికి అంకితం చేశానని



ప్రజలను దారుణంగా మోసం చేశారని ధ్వజమెత్తారు. నిర్వాసితుల పరిహారం విషయంలోనూ కేవలం జీవోలు ఇచ్చి అరకొర చెల్లింపులతో తీవ్ర అన్యాయం చేశారని దుయ్యబట్టారు.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రాగానే ఆ గ్రహణం వీడిపోయిందని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవతో సొరంగాల్లోకి కృష్ణా జలాలను పంపి నిజమైన అర్థంలో ప్రాజెక్టును జాతికి అంకితం చేశారని కొనియాడారు. నిర్వాసితుల పట్ల సీఎం చంద్రబాబు పెద్ద మనసుతో వ్యవహరించి వారికి తగిన పరిహారం అందించారని మంత్రి నిమ్మల రామానాయుడు వివరించారు.

# వెలిగొండపై జగన్ మోసం!

**పూర్తికాకుండానే జాతికి అంకితమా?**

**4,000 కోట్ల పనులు వదిలేసి డ్రామాలు**

**నిప్పులు చెరిగిన ఎంపీ మాగుంట**

**మార్కాపురం (సమయం న్యూస్):** వెలిగొండ ప్రాజెక్టు పూర్తికాకుండానే జాతికి అంకితం చేశానంటూ వైఎస్ జగన్ దారుణంగా మోసం చేశారని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి ధ్వజమెత్తారు. మార్కాపురంలో జరిగిన వెలిగొండ ప్రాజెక్టు తొలి దశ ప్రారంభోత్సవ సభలో ఆయన మాట్లాడారు. 4,000 కోట్ల పనులు పెండింగ్ లో ఉండగానే ప్రాజెక్టును జాతికి అంకితం చేయడం విడ్డూరమన్నారు. ఫేక్ డ్రామాలు, సినిమా సెట్టింగులతో రైతులను మోసం చేసిన వారిని నిలదీయాలని పిలుపునిచ్చారు. 2019లో కులం చూసి ఓటేస్తే జగన్ తీవ్రంగా వంచించారని మండిపడ్డారు. రెండు సొరంగాలు పూర్తయ్యాయని చెబుతున్న నాయకులు అప్పట్లో ఎందుకు నీళ్లు ఇవ్వలేకపోయారని ఆయన నిలదీశారు.



గత ప్రభుత్వ హయాంలో సొరంగంలో యంత్రం ఇరుక్కుపోతే కనీసం పట్టించుకోలేదని మాగుంట ఆరోపించారు. కూటమి ప్రభుత్వం వచ్చాకే ఆ సమస్యలను పరిష్కరించి వెలిగొండ పనులు పూర్తి చేసి నీళ్లు ఇచ్చామని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు పూర్తి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీసుకున్న చొరవను, నిర్వాసితులకు అందించిన సాయాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. ప్రాజెక్టు ప్రారంభోత్సవం చూస్తుంటే ఆనందంతో తన కళ్లలో నీళ్లు తిరుగుతున్నాయన్నారు. ఇంకా 1,900 కోట్ల పనులు మిగిలి ఉన్నాయని, వాటిని కూడా త్వరలోనే పూర్తి చేసి ప్రాజెక్టును వంద శాతం అందుబాటులోకి తీసుకొస్తామని మాగుంట ధీమా వ్యక్తం చేశారు.

# విశాఖ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం!

- దేశంలో నంబర్ వన్ సిటీగా నిలబెడతామన్న మంత్రి లోకేష్
- పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం
- నూతన కాలేజీ, ఏజ్ కేర్ సెంటర్ భవనాలు ప్రారంభం
- 2 వేల కోట్ల పెట్టుబడితో ఏఐజీ హాస్పిటల్స్
- రోశయ్య విగ్రహానికి ది స్టాట్యూ ఆఫ్ స్టేట్స్‌మన్ అని పేరు



**విశాఖపట్నం (సమయం న్యూస్):** రాష్ట్ర విభజన తర్వాత విశాఖపట్నానికి ఎంతో చేయాల్సిన బాధ్యత తమపై ఉందని, దేశంలోనే నంబర్ వన్ సిటీగా ఈ నగరాన్ని నిలబెడతామని విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. విశాఖ ఎకనామిక్ రీజియన్ దేశంలోనే తొలి వన్ ట్రిలియన్ డాలర్ల ఎకనామిక్ రీజియన్‌గా మారుతుందని ప్రధాని మోదీ సైతం చెప్పారని ఆయన గుర్తుచేశారు. శనివారం ఆయన విశాఖ నగరంలో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. విశాఖ ఆనందపురం మండలం ఎండాడ వద్ద ఏఐజీ హాస్పిటల్స్ నిర్మాణానికి సంస్థ ఛైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వర్ రెడ్డితో కలిసి మంత్రి లోకేష్ భూమిపూజ, శంకుస్థాపన చేశారు. రూ.2 వేల కోట్ల పెట్టుబడి, వెయ్యి పడకల సామర్థ్యంతో నిర్మించనున్న ఈ ఆసుపత్రి ద్వారా 9 వేల మందికి ఉద్యోగాలు రానున్నాయి. 9 ఎకరాల్లో ఆసుపత్రి, 2.5 ఎకరాల్లో నర్సింగ్ కళాశాలను ఏర్పాటు చేయనున్నారు. తొలి దశలో భాగంగా 650 పడకల సామర్థ్యంతో 2028 అక్టోబర్ నాటికి పనులు పూర్తిచేయనున్నారు. రెండో దశలో 350 పడకల సామర్థ్యంతో మరో రెండేళ్లలో పూర్తిచేయనున్నారు.

### కొణిజేటి రోశయ్యకు అరుదైన గౌరవం

విశాఖపట్నంలోని సిరిపురం సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య కాంస్య విగ్రహాన్ని మంత్రి నారా లోకేష్ ఆవిష్కరించారు. ఈ విగ్రహానికి 'ది స్టాట్యూ ఆఫ్ స్టేట్స్‌మన్' అని ఆయన నామకరణం చేశారు. రాజకీయ విలువల గురించి మాట్లాడాలంటే గుర్తొచ్చే పేర్లలో రోశయ్య ఒకరని కొనియాడారు. పదవులు శాశ్వతం కాదని, ప్రజలకు చేసిన సేవే శాశ్వతమని నమ్మిన వ్యక్తి రోశయ్య అని కొనియాడారు. ఎలాంటి రాజకీయ నేపథ్యం లేకుండా ఎదిగిన ఆయన జీవితం నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు.

### హరే కృష్ణ గోకుల్ ట్రస్ట్ లో..

ప్రేమ ఉదయం, ఏజ్ కేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గంభీరం వద్ద నిర్వహించిన పలు కార్యక్రమాల్లో లోకేష్ పాల్గొన్నారు. హరే కృష్ణ మూవ్‌మెంట్ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. హరే కృష్ణ వైకుంఠం కల్చరల్ కాంప్లెక్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ప్రేమ గ్రూప్ ఇన్‌స్టిట్యూషన్స్ నూతన కాలేజీ భవనం, ఏజ్ కేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలోని జెరియాట్రిక్, పాలియేటివ్ కేర్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. సమాజ సేవ కోసం 6 ఎకరాల భూమిని కేటాయించిన దివంగత పద్మశ్రీ డాక్టర్ ఆదినారాయణరావు కుటుంబ సేవలను ఈ సందర్భంగా మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీ మతుకుమిల్లి శ్రీభరత్, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, గంటా శ్రీనివాసరావు, విష్ణు కుమార్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# వెలిగొండ ఘనత వైఎస్సార్ దే!

**బాబుది కేవలం ప్రచార ఆర్భాటమే**

**ప్రాజెక్టును జాతికి అంకితం చేసింది జగనే**

**నిర్వాసితులకు పరిహారంపై కూటమి సర్కారు వైఫల్యం**

**బహిరంగ చర్చకు సిద్ధమన్న అప్పిరెడ్డి, సుధాకర్ బాబు**

**తాడేపల్లి (సమయం న్యూస్):** వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేసింది వైఎస్ రాజశేఖరరెడ్డి, వైఎస్ జగన్ అయితే.. ఆ ఘనతను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దొంగిలిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నేతలు లేళ్ల అప్పిరెడ్డి, టీజేఆర్ సుధాకర్ బాబు తీవ్రంగా మండిపడ్డారు.



తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. మొత్తం 37 కిలోమీటర్ల సొరంగ పనుల్లో 31 కిలోమీటర్లకు పైగా పనులు వైఎస్సార్, జగన్ హయాంలోనే పూర్తయ్యాయని స్పష్టం చేశారు. చంద్రబాబు హయాంలో కేవలం 6.68 కిలోమీటర్ల పనులు మాత్రమే జరిగాయని, వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా 10.56 కిలోమీటర్ల పనులు పూర్తి చేశారని వివరించారు. మొదటి సొరంగం పనులు 2021 జనవరిలో, రెండో సొరంగం పనులు 2024 జనవరిలో పూర్తి కాగా.. వైఎస్ జగన్ 2024 మార్చిలో వాటిని జాతికి అంకితం చేశారని నేతలు గుర్తుచేశారు. చంద్రబాబు 1996లో ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసినా ఆ తర్వాత 8 ఏళ్లలో ఎలాంటి పురోగతి సాధించలేదని విమర్శించారు. అధికారంలోకి వచ్చి 27 నెలలవుతున్నా నిర్వాసిత కుటుంబాలకు పరిహారం, పునరావాసం కల్పించడంలో కూటమి సర్కారు పూర్తిగా విఫలమైందని దుయ్యబట్టారు. ప్రచార ఆర్భాటాలు మాని వెంటనే పరిహారం అందించడంపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. టీడీపీ అధిష్టానాన్ని సంతోషపెట్టేందుకే ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని, ఆయన వెంటనే రాజీనామా చేసి వెలిగొండ అజెండాతో మళ్లీ ఎన్నికల బరిలో నిలవాలని సుధాకర్ బాబు సవాల్ విసిరారు. ప్రాజెక్టులో ఏ ప్రభుత్వం ఎంతమేర పనులు చేసిందనే దానిపై బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

# తిరుమలగిరిపై బ్రహ్మోత్సవాల కోలాహలం!

- ఉత్సవాలకు ముస్తాబైన ఏడుకొండలు
- 8న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, 14న అంకురార్పణ
- 15న ధ్వజారోహణంతో మొదలు.. 23న చక్రస్నానంతో ముగింపు



**తిరుమల (సమయం న్యూస్):** కలియుగ ప్రత్యక్ష దైవమైన తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామికి నిర్వహించే ఉత్సవాల్లో బ్రహ్మోత్సవాలు అత్యంత ప్రధానమైనవి. చాంద్రమానం ప్రకారం ప్రతి 3 ఏళ్లకోసారి అధిక మాసం వస్తుంది. ఈ కారణంగా ఈ ఏడాది 2 బ్రహ్మోత్సవాలు భక్తులను అలరించనున్నాయి. సెప్టెంబరు 15 నుంచి 23వ తేదీ వరకు శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు, అక్టోబరు 12 నుంచి 20వ తేదీ వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. నవరాత్రి ఉత్సవాల్లో ధ్వజారోహణం, ధ్వజావరోహణం మినహా మిగతా వాహన సేవలన్నీ ఒకేలా ఉంటాయి.

బ్రహ్మోత్సవాల నేపథ్యంలో సెప్టెంబరు 8న ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించి ప్రాంగణాన్ని శుద్ధి చేస్తారు. 14న రాత్రి 7 గంటలకు అంకురార్పణ జరుపుతారు. 15న సాయంత్రం 6.21 గంటలకు బంగారు ధ్వజస్తంభంపై గరుడధ్వజాన్ని ఎగురవేసి సకల దేవతలను ఆహ్వానిస్తూ ధ్వజారోహణం నిర్వహిస్తారు. ప్రతిరోజూ ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, రాత్రి 7 నుంచి 9 గంటల వరకు వాహన సేవలు జరుగుతాయి.

ఉత్సవాల్లో భాగంగా 15న రాత్రి పెద్దశేష వాహనంపై స్వామివారు ఊరేగుతారు. 16న ఉదయం చిన్నశేష వాహనం, రాత్రి హంస వాహనంపై భక్తులకు దర్శనమిస్తారు. 17న ఉదయం సింహ వాహనం, రాత్రి ముత్యపుపందిరి వాహనంపై కనువిందు చేస్తారు. 18న ఉదయం కల్పవృక్ష వాహనం, రాత్రి సర్వభూపాల వాహన సేవలు ఉంటాయి. 19న ఉదయం మోహినీ అవతారం, సాయంత్రం 6.30 గంటలకు గరుడ వాహన సేవలు నిర్వహిస్తారు. 20న ఉదయం హనుమంత వాహనం, సాయంత్రం 4 గంటలకు స్వర్ణరథం, రాత్రి గజ వాహన సేవలు జరుపుతారు.

ఆ తర్వాత 21వ తేదీ ఉదయం సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ వాహనాలపై స్వామివారు విహరిస్తారు. 22న ఉదయం 7.30 గంటలకు రథోత్సవం అంగరంగ వైభవంగా జరుగుతుంది. రాత్రి అశ్వ వాహనంపై అభయమిస్తారు. 23న ఉదయం పుష్కరిణిలో చక్రస్నానం వేడుకను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. అదే రోజు రాత్రి ధ్వజావరోహణ ఘట్టంతో 9 రోజుల పాటు జరిగే శ్రీవారి బ్రహ్మోత్సవాలు వైభవంగా ముగుస్తాయి.

# ఏపీ సిట్‌పై సుప్రీం సీరియస్!

**మద్యం కేసు దర్యాప్తు తీరుపై తీవ్ర అసహనం**

**కస్టడీ కోరే విధానం ఇదేనా అని ప్రశ్న**

**రాజ్ కేశిరెడ్డి, వాసుదేవరెడ్డికి నోటీసులు**



**న్యూఢిల్లీ (సమయం న్యూస్):** ఏపీలో మద్యం అక్రమ రవాణా కేసుకు సంబంధించి సిట్ దర్యాప్తు తీరుపై సుప్రీంకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. 2 ఏళ్లుగా కేసు నడుస్తున్నా ఇంతవరకు ఏమీ తేల్చకపోవడాన్ని తప్పుబట్టింది. ముందుగా సిట్ దర్యాప్తు తీరును పరిశీలించిన తర్వాతే హైకోర్టు తీర్పును సమీక్షిస్తామని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. రాజ్ కేశిరెడ్డి కేసులో హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సిట్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది.

రాజ్ కేశిరెడ్డి కస్టడీ విషయంలో సిట్ నిజంగానే సీరియస్‌గా ఉందా అని కోర్టు ప్రశ్నించింది. ముందస్తు బెయిల్ పెండింగ్‌లో ఉండగా ప్రొడక్షన్ వారెంట్ అడగటాన్ని, అప్పటికే కస్టడీలో ఉన్న వ్యక్తి పారిపోయే అవకాశం లేకపోయినా విచారణ కోరడాన్ని ఆక్షేపించింది. పోలీసు కస్టడీకి సిద్ధంగా లేకుండా జ్యుడీషియల్ కస్టడీ అడగటం ఏంటని నిలదీసింది. మరోవైపు ఈ కేసులో రాజ్ కేశిరెడ్డి, డి.వాసుదేవరెడ్డిలకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. విచారణ ప్రక్రియలో నిబంధనలు సరిగా పాటించలేదనే కారణంతో హైకోర్టు ఆదేశాలను రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంలో సవాల్ చేయగా.. తదుపరి విచారణను ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం వాయిదా వేసింది.

# దేశ జీడీపీ 7.8 శాతం వృద్ధి నమోదు

**అంతర్జాతీయ వ్యతిరేకతల మధ్య వృద్ధిరేటు**

**హర్షం వ్యక్తం చేసిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి**


**న్యూఢిల్లీ,ఆగస్ట్31:** 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో భారతదేశ జీడీపీ 7.8 శాతం వృద్ధిని నమోదు చేసింది. 2025-26 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో నమోదైన 6.9 శాతం వృద్ధితో పోలిస్తే.. తాజా వృద్ధి రేటు భారత ఆర్థిక వ్యవస్థ పటిష్టతను మరోసారి చాటిచెప్పింది. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న అనిశ్చితి, చమురు ధరల్లో ఒడిదుడుకులు, సప్లై చైన్ సవాళ్లు ఉన్నప్పటికీ భారత్ ఇంతటి వృద్ధిని సాధించడం అసాధారణ విజయం. ఇది ప్రధాని మోదీ దూరదృష్టి, నిర్ణయాత్మక నాయకత్వం, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సమర్థవంతమైన విధానాలపై ప్రజలు, వ్యాపారవేత్తలకు ఉన్న విశ్వాసానికి నిదర్శనం. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నప్పటికీ.. భారత్ మాత్రం ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతోంది. అన్ని ప్రధాన రంగాల్లో ఆర్థిక వృద్ధి విస్తృతంగా కనిపించడం సానుకూల పరిణామం. వ్యవసాయం, అనుబంధ రంగాల్లో 3.6 శాతం వృద్ధి సాధించడంతో ప్రైమరీ సెక్టార్ (వ్యవసాయం, మత్స్యరంగం, మైనింగ్, అటవీ సంపద) సానుకూల వృద్ధిని సాధించింది.అదే సమయంలో సెకండరీ సెక్టార్ (తయారీ, నిర్మాణ, విద్యుత్ రంగాలు) 8.6 శాతం, తృతీయ రంగం (రిటైల్ దుకాణాలు, బ్యాంకింగ్, విద్య, వైద్యం, రవాణా మొదలైనవి) 10 శాతం వృద్ధిని నమోదు చేయడం గొప్ప విషయం. ముఖ్యంగా ఫ్లై÷నాన్షియల్, రియల్ ఎస్టేట్, ఐటీ, ప్రొఫెషనల్ సర్వీసెస్ రంగాలు 12.1 శాతం వృద్ధిని నమోదు చేయడం భారత సేవా రంగం ఎంత పటిష్టంగా ఉందో తెలియజేస్తోంది. వ్యవసాయ రంగం దూసుకెళ్తున్న తీరు ఆశాజనకంగా ఉంది. ఎల్‌నినో వంటి వాతావరణ సవాళ్లు ఉన్నప్పటికీ గతేడాదితో సమానంగా సాగు ఉండటం సానుకూల పరిణామం. రానున్న రెండో, మూడో త్రైమాసికాల్లో వ్యవసాయ రంగం మరింత మెరుగైన పనితీరును కనబరిచి దేశ ఆర్థిక వృద్ధికి మరింత బలం చేకూర్చు తుందనే విశ్వాసం కలుగుతోంది.

# పౌర సేవలపై డేటా నిఘా!

**రియల్ టైమ్ గవర్నెన్స్‌పై సీఎం చంద్రబాబు సమీక్ష**

అమరావతి (సమయం న్యూస్): ప్రజలు వ్యక్తం చేసే అభిప్రాయాల ఆధారంగా డేటా అనలిటిక్స్ సాయంతో పౌరసేవలను మరింత మెరుగుపరచాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో ఆయన రియల్ టైమ్ గవర్నెన్స్ పై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. మహిళలపై నేరాలు, గంజాయి నియంత్రణ సహా పలు అంశాలపై విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. వెలిగొండ, అల్లూరి విమానాశ్రయం ప్రారంభోత్సవాల్లో ప్రజల భాగస్వామ్యం అద్భుతంగా ఉందని, ప్రతి కార్యక్రమంలోనూ ఇదే స్ఫూర్తి కొనసాగించాలని దిశానిర్దేశం చేశారు.

పట్టణ, గ్రామీణ ప్రాంతాలతో పాటు సంక్షేమ హాస్టళ్లలో శానిటేషన్ పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, ఇందులో రాజీ పడే ప్రసక్తే లేదని సీఎం తేల్చి చెప్పారు. ఇప్పటివరకు స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో తాను 20 సార్లు పాల్గొన్నట్లు వెల్లడించారు. ప్రతి నెలా మొదటి ఆదివారం విద్యార్థుల తల్లిదండ్రులను ఆహ్వానించి హాస్టళ్లలో భోజనం, తాగునీరు తదితర సదుపాయాలపై వివరించాలని సూచించారు. అన్నా క్యాంటీన్లకు సాయం చేసే దాతలను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. ఎప్పటికప్పుడు సమీక్షలు చేసుకుంటూ లోటుపాట్లను సవరించుకోవాలని, అధికారుల పనితీరు ఆధారంగా జిల్లా, రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు ఇవ్వాలని స్పష్టం చేశారు. పీజీఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.



రెవెన్యూ సహా అన్ని ప్రభుత్వ విభాగాలు సమీకృత విధానం ద్వారా ఆన్ లైన్ లో సేవలు అందించాలని, ధ్రువపత్రాలన్నీ ఆన్ లైన్ లోనే జారీ చేసేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. రాష్ట్రంలో సాగు స్థితిపై ఎప్పటికప్పుడు అధ్యయనం చేసి రైతులకు సూచనలు ఇవ్వాలని అధికారులకు సూచించారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడంతో పాటు ఉద్యాన పంటలను కాపాడుకునేలా నీటి వనరులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. 5.70 లక్షల ఎకరాల భూమిని నిరుపయోగంగా ఉంచకుండా వాడుకోవాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షలో సీఎస్ సాయి ప్రసాద్ సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పట్టాలపై మృత్యువు!

**రైలు ఢీకొని ముగ్గురి దుర్మరణం**

**కర్ణాటకలోని దొడ్డబల్లాపూర్ స్టేషన్లో ఘోరం**

**మృతులు ఏపీలోని హిందూపురం వాసులు**



**బెంగళూరు (సమయం న్యూస్):** కర్ణాటకలో జరిగిన ఘోర ప్రమాదంలో ఏపీలోని హిందూపురానికి చెందిన ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. బెంగళూరు రూరల్ జిల్లా దొడ్డబల్లాపూర్ రైల్వే స్టేషన్లో ట్రాక్ దాటుతున్న ఓ మహిళ, ఇద్దరు బాలికలను వేగంగా వచ్చిన రైలు ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆ ముగ్గురూ అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. మృతులను హిందూపురం వాసులైన ఇర్ఫాన్ (46), రుకియా (13), రాకియా (8)గా పోలీసులు గుర్తించారు.

ఆదివారం సెలవు దినం కావడంతో దొడ్డబల్లాపూర్‌లోని బంధువుల ఇంటికి వీరు వచ్చారు. సోమవారం తిరిగి తమ ఊరికి వెళ్లే క్రమంలో స్టేషన్లో రైల్వే ట్రాక్ దాటుతుండగా ఈ ఘోరం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న యలహంక రైల్వే పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాలను ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## సంపాదకీయం



# హిమాలయాల్లో వాటర్ బాంబ్స్!

**మంచుకొండల్లో పొంచి ఉన్న జలప్రళయం**

**భారత్‌లోనే 7,500 హిమానీనద సరస్సులు**


**200 వరకు అధిక ముప్పు జాబితాలో**

**గంగా పరీవాహకంలోనే 4,700కు పైగా సరస్సులు**

**ముందస్తు హెచ్చరిక వ్యవస్థలే రక్షణ కవచం**

పైకి ప్రశాంతంగా కనిపించే మంచుకొండలు.. వాటి మధ్య నిశ్శబ్దంగా పేరుకుపోతున్న అపార జలరాశి.. సహజ అడ్డుకట్ట ఒక్కసారి తెగిందంటే క్షణాల్లోనే దిగువ ప్రాంతాలపై విరుచుకుపడే జలప్రళయం! హిమాలయాల్లోని కొన్ని హిమానీనద సరస్సులు ఇప్పుడు ఇలాంటి ప్రమాదాన్నే మోస్తున్నాయి. అందుకే నిపుణులు వాటిని 'వాటర్ బాంబ్స్'గా అభివర్ణిస్తున్నారు. నేపాల్‌లో సంభవించిన భారీ వరదల నేపథ్యంలో భారత హిమాలయ ప్రాంతాల్లోని హిమానీనద సరస్సుల భద్రత మరోసారి చర్చకు వచ్చింది. హిమానీనదాలు కరిగే క్రమంలో ఏర్పడే సరస్సుల్లో భారీగా నీరు చేరుతుంది. మంచు, రాళ్లు, మట్టితో ఏర్పడిన సహజ అడ్డుకట్టలు ఆ నీటిని నిలువరిస్తుంటాయి. భారీ వర్షాలు, వేగంగా మంచు కరగడం, కొండచరియలు విరిగిపడటం లేదా భూకంపాల కారణంగా ఈ అడ్డుకట్టలు బలహీనపడి ఒక్కసారిగా తెగిపోతే.. అపారమైన నీటితో పాటు బురద, రాళ్లు దిగువకు దూసుకొస్తాయి. దీనినే హిమానీనద సరస్సు విస్ఫోట వరదగా పేర్కొంటారు. సాధారణ వరదలతో పోలిస్తే ఇలాంటి విపత్తుల్లో ముందస్తుగా స్పందించేందుకు సమయం చాలా తక్కువగా ఉండొచ్చు. ఎత్తైన ప్రాంతం నుంచి భారీ వేగంతో వచ్చే నీరు, రాళ్లు, బురద మార్గంలోని రహదారులు, వంతెనలు, జలవిద్యుత్ ప్రాజెక్టులు, నివాస ప్రాంతాలను తీవ్రంగా దెబ్బతీసే ప్రమాదం ఉంటుంది. నేపాల్–టిబెట్ సరిహద్దు ప్రాంతంలో ఇటీవల సంభవించిన భారీ వరదలు ఈ ప్రమాదంపై మరోసారి హెచ్చరికలు పంపాయి. భోటేకోశి, త్రిశూలి నదుల్లో వరద ప్రవాహం పెరగడంతో మధ్య నేపాల్‌లోని పలు ప్రాంతాలు తీవ్రంగా ప్రభావితమైనట్లు నివేదికలు పేర్కొన్నాయి. టిబెట్‌లోని నదీ మూల ప్రాంతాల సమీపంలో పరిస్థితులను కూడా అధికారులు నిశితంగా గమనిస్తున్నారు. జాతీయ విపత్తు నిర్వహణ వ్యవస్థకు చెందిన అధికారుల అంచనాల ప్రకారం భారత హిమాలయ ప్రాంతంలోని 11 నదీ పరీవాహక ప్రాంతాల్లో సుమారు 28 వేల హిమానీనద సరస్సులు ఉన్నట్లు సమాచారం. వాటిలో దాదాపు 7,500 సరస్సులు భారత భూభాగంలోనే ఉన్నట్లు అంచనా. ఒక్క గంగా నదీ పరీవాహక ప్రాంతంలోనే 4,700కు పైగా హిమానీనద సరస్సులు ఉన్నట్లు పేర్కొంటున్నారు. వీటన్నింటికీ ఒకే స్థాయిలో ప్రమాదం ఉందని మాత్రం భావించకూడదు. పరిమాణం, నీటి నిల్వ, సహజ అడ్డుకట్టల స్థిరత్వం, పరిసర భౌగోళిక పరిస్థితుల ఆధారంగా ప్రమాదాన్ని అంచనా వేస్తున్నారు. సుమారు 195 నుంచి 200 సరస్సులను అధిక ప్రమాదం ఉన్నవిగా గుర్తించినట్లు సమాచారం. హిమానీనద సరస్సు విస్ఫోట వరద ప్రభావం కేవలం మంచుకొండలకే పరిమితం కావాల్సిన అవసరం లేదు. ఎగువ ప్రాంతాల్లో ఒక్కసారిగా భారీ జలప్రవాహం ఏర్పడితే నదుల ద్వారా దిగువ ప్రాంతాలకు చేరి వరద తీవ్రతను పెంచే అవకాశం ఉంటుంది. నేపాల్ వైపు నుంచి ప్రవహించే కోసి, గండక్ వంటి నదీ వ్యవస్థల్లో అసాధారణ వరద ప్రవాహాలు ఏర్పడితే ఉత్తర బీహార్‌లోని పలు ప్రాంతాలపై ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. అలాగే సిక్కిం హిమాలయ ప్రాంతంలో విపత్తులు సంభవిస్తే తీస్తా నదీ పరీవాహకంలోని సిక్కిం, ఉత్తర బెంగాల్ ప్రాంతాలకు ముప్పు ఏర్పడవచ్చు. అయితే ఒక సరస్సు విస్ఫోటనం వల్ల 'పలు రాష్ట్రాలు కొట్టుకుపోతాయి' అని సాధారణీకరించడం సరికాదు. ప్రభావ తీవ్రత సరస్సు పరిమాణం, భౌగోళిక పరిస్థితులు, నదీ ప్రవాహ మార్గం వంటి అనేక అంశాలపై ఆధారపడి ఉంటుంది. హిమాలయాల్లో ఉష్ణోగ్రతల మార్పులు, హిమానీనదాల కరుగుదలతో సరస్సుల పరిమాణంలో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉండటంతో నిరంతర పర్యవేక్షణ కీలకంగా మారుతోంది. దీనికి తోడు పర్వత ప్రాంతాల్లో విచక్షణారహిత నిర్మాణాలు, నదుల సహజ ప్రవాహ మార్గాల్లో ఆక్రమణలు, పర్యావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోని మౌలిక వసతుల నిర్మాణం విపత్తు సంభవించినప్పుడు నష్టాన్ని మరింత పెంచవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రమాదకర హిమానీనద సరస్సులను గుర్తించి వాటిపై నిరంతర నిఘా ఉంచడం ఇప్పుడు అత్యంత కీలకంగా మారింది. ఉపగ్రహ చిత్రాల ద్వారా సరస్సుల విస్తీర్ణం, నీటి నిల్వలో మార్పులు, పరిసర భూభాగంలో చోటుచేసుకుంటున్న పరిణామాలను పరిశీలించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. అధిక ప్రమాదం ఉన్న సరస్సుల వద్ద నీటిమట్టం, ఉష్ణోగ్రత తదితర మార్పులను గుర్తించే ఆటోమేటిక్ సెన్సార్లతో ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను ఏర్పాటు చేయడం, ప్రమాద ప్రాంతాలను మ్యాపింగ్ చేయడం, అవసరమైన చోట సురక్షిత డ్రైనేజీ, నీటి మళ్లింపు వంటి ఇంజనీరింగ్ చర్యలు చేపట్టడం కీలకమని నిపుణులు సూచిస్తున్నారు. ప్రమాద ప్రాంతాల్లో విచక్షణారహిత నిర్మాణాలను నియంత్రించడం కూడా అంతే ముఖ్యమని చెబుతున్నారు. నేపాల్ విపత్తు మరోసారి వినిపిస్తున్న హెచ్చరిక ఒక్కటే.. హిమాలయాల్లో పేరుకుపోతున్న జలరాశులను తేలిగ్గా తీసుకోవద్దు. మంచుకొండల మధ్య నిశ్శబ్దంగా ఉన్న సరస్సు ఎప్పుడు ప్రమాదకరంగా మారుతుందో నిరంతర శాస్త్రీయ పర్యవేక్షణతోనే గుర్తించగలం. విపత్తు వచ్చిన తర్వాత సహాయక చర్యలకంటే.. ముందే ప్రమాదాన్ని పసిగట్టి ప్రజలను అప్రమత్తం చేయడమే అసలైన రక్షణ.

# మోదీ-పుతిన్ కీలక భేటీ



- వాణిజ్యం నుంచి రక్షణ వరకు విస్తృత చర్చలు
- ఇంధనం, పెట్టుబడుల సహకారంపై ప్రత్యేక దృష్టి
- ఎస్‌సీవో సదస్సు వేదికగా ఇరువురు నేతల సమావేశం
- ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్‌తోనూ మోదీ భేటీ
- 'నోమాడ్ గేమ్స్'కు హాజరైన మోదీ-పుతిన్

**బిష్కెక్:** షాంఘై సహకార సంస్థ సదస్సు సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కీలకంగా సమావేశమయ్యారు. భారత్–రష్యా ద్వైపాక్షిక సంబంధాలతో పాటు వాణిజ్యం, పెట్టుబడులు, ఇంధనం, రక్షణ రంగాల్లో సహకారాన్ని మరింత విస్తరించడంపై ఇరువురు నేతలు చర్చించారు. కిర్గిజ్‌స్థాన్ రాజధాని బిష్కెక్‌లో జరుగుతున్న ఎస్‌సీవో సదస్సు సందర్భంగా ఈ భేటీ జరిగింది. భారత్–రష్యా మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు ఇరు దేశాలకు సంబంధించిన కీలక అంశాలను నేతలు సమీక్షించినట్లు సమాచారం. ఇటీవల మాస్కోలో భారత్–రష్యా అంతర్ ప్రభుత్వ కమిషన్ సమావేశం విజయవంతంగా జరిగిందని, దానికి కొనసాగింపుగా మోదీ–పుతిన్ భేటీలో ద్వైపాక్షిక సంబంధాలపై సమగ్ర సమీక్ష జరుగుతుందని భారత విదేశాంగ శాఖ అంతకుముందు వెల్లడించింది. విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ ఇటీవల రష్యాలో రెండు రోజుల పర్యటన సందర్భంగా క్రెమ్లిన్‌లో పుతిన్‌తో సమావేశమయ్యారు. ప్రధాని మోదీ శుభాకాంక్షలను ఆయనకు తెలియజేశారు. ఈ పరిణామాల అనంతరం మోదీ–పుతిన్ ప్రత్యక్షంగా సమావేశం కావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

### ఇరాన్ అధ్యక్షుడితోనూ మోదీ భేటీ

ఎస్‌సీవో సదస్సు సందర్భంగా ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్‌తోనూ ప్రధాని మోదీ సమావేశమయ్యారు. దాదాపు రెండేళ్ల తర్వాత ఇరు దేశాల నేతలు సమావేశమైనట్లు కథనం పేర్కొంది. భారత్–ఇరాన్ సంబంధాలకు సంబంధించిన అంశాలు ఈ సందర్భంగా చర్చకు వచ్చినట్లు తెలిపింది. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తోనూ మోదీ సమావేశమయ్యే అవకాశమున్నట్లు సమాచారం. అయితే ఇరువురు నేతల మధ్య ప్రత్యేక ద్వైపాక్షిక సమావేశానికి అధికారికంగా షెడ్యూల్ ఖరారు కాలేదని పేర్కొంది.

### 'నోమాడ్ గేమ్స్'లో మోదీ--పుతిన్

ఎస్‌సీవో సదస్సు కార్యక్రమాల అనంతరం నిర్వహించిన 'నోమాడ్ గేమ్స్'కు మోదీ, పుతిన్ హాజరయ్యారు. అంతర్జాతీయ వేదికపై ఇరువురు నేతలు కలిసి పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అంతకుముందు ప్రధాని మోదీ రెండు రోజుల ఉజ్బెకిస్థాన్ పర్యటనలో ఆ దేశ అధ్యక్షుడు షవ్కత్ మిర్జియోయేవ్‌తో సమావేశమయ్యారు. శతాబ్దాల నాటి సాంస్కృతిక సంబంధాలు, ప్రజల మధ్య అనుబంధాన్ని పునాదిగా చేసుకుని భారత్–ఉజ్బెకిస్థాన్ ద్వైపాక్షిక సంబంధాలను మరింత విస్తరించడంపై ఇరువురు నేతలు చర్చించినట్లు భారత విదేశాంగ శాఖ తెలిపింది. 2001లో చైనా, రష్యా, నాలుగు మధ్య ఆసియా దేశాలతో భద్రతా వేదికగా ప్రారంభమైన షాంఘై సహకార సంస్థ.. కాలక్రమేణా సభ్యత్వం, ప్రభావాన్ని విస్తరించుకుంది. తాజా సదస్సు సందర్భంగా భారత్–రష్యా సంబంధాలపై జరిగిన మోదీ–పుతిన్ భేటీ ప్రధాన ఆకర్షణగా నిలిచింది.

# అమెరికా-కెనడా మధ్య వాణిజ్య యుద్ధం

**కెనడా దారుణమైన దుర్వినియోగదారు**

**కెనడాలో ఉన్న కంపెనీలన్నీ అమెరికాకు వచ్చేయాలి**

**ట్రూత్‌లో ట్రంప్ వరుస పోస్టులు**

**వాషింగ్టన్, ఆగస్ట్ 31:** అమెరికా–కెనడా మధ్య వాణిజ్య యుద్ధం రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతోంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలకు కెనడా ప్రధాని మార్క్ కార్నీ సహా ఇతర నేతలు గట్టిగా బదులు ఇస్తుండటంతో రెండు దేశాలు సంబంధాలు దిగజారుతున్నాయి. ఈ క్రమంలోనే ట్రంప్ మరోసారి ఆ దేశంపై విరుచుకుపడ్డారు. తమకు కెనడా నుంచి ఏమీ వద్దని పేర్కొన్న ఆయన తమ సుంకాలను తప్పించుకునేందుకు అక్కడి కంపెనీలన్నీ అమెరికాకు తరలివచ్చేయాలని సూచించారు. ఆ దేశం దారుణమైన దుర్వినియోగదారు అని మండిపడ్డారు. ఈ మేరకు ట్రూత్‌లో వరుస పోస్టులు పెట్టారు. 2024 అధ్యక్ష ఎన్నికల్లో నేను పోటీ చేస్తున్నానని ప్రకటించిన సమయంలోనే డెట్రాయిట్‌లోని కీలక ఫ్యాక్టరీని మూసివేయడానికి ఫోర్డ్ సిద్ధమైంది. ఎన్నికల్లో నేను ఆధిక్యంలోకి రావడంతో ఏం జరుగుతుందో చూద్దామని ఆ సంస్థ వేచి చూసింది. ఇప్పుడు నిరంతరాయంగా నడుస్తూ.. భారీగా లాభాలను ఆర్జిస్తోంది. జనరల్ మోటార్స్, ఇతర సంస్థల విషయంలో ఇలాంటి ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. సుంకాల వల్లే ఇదంతా జరిగింది. మనకు కెనడియన్ కార్లు, పరికరాలు సహా ఏమీ వద్దు. కెనడాతో వాణిజ్యంలో అమెరికా ఏటా 60 బిలియన్ డాలర్లకుపైగా నష్టపోతోంది. దశాబ్దాలుగా ఈ దోపిడీ జరుగుతోంది. ఏనాడో మననుంచి లాగేసుకున్న



వ్యాపారాలన్నీ సుంకాలను తప్పించుకోవడానికి ఇప్పుడు అమెరికాకు బారులు తీరుతున్నాయి. కెనడా పట్ల కఠిన వైఖరిని అవలంబించడంలో గత ప్రభుత్వాలు విఫలమయ్యాయని ట్రంప్ విమర్శలు చేశారు. అమెరికా–కెనడా మధ్య వాణిజ్య ఒప్పందం చివరి నిమిషంలో రద్దయింది. అమెరికా ఇప్పటికే 50 శాతం సుంకాలతో విరుచుకుపడగా.. కెనడా సైతం అగ్రరాజ్యంపై తాజాగా ప్రతీకార సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. కెనడియన్ కార్లు, ట్రక్కులు, ఆటోమోటివ్ విడిభాగాలు, ఉక్కు దిగుమతులపై ట్రంప్ 50శాతం టారిఫ్‌లు విధించారు.

# జాతీయ జెండాను అవమానిస్తే మూల్యం తప్పదు

**ఖలిస్థానీ వేర్పాటువాదులకు కిరణ్ రిజిజు హెచ్చరిక**

- న్యూయార్క్‌లో ఘటనపై కేంద్ర మంత్రి ఆగ్రహం
- దేశాన్ని, జెండాను అవమానించొద్దని హితవు
- నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

**న్యూఢిల్లీ, ఆగస్టు 31:** న్యూయార్క్‌లో భారత జాతీయ జెండాను అవమానించిన ఖలిస్థానీ వేర్పాటువాదులకు కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు గట్టి హెచ్చరిక చేశారు. దేశాన్ని, జాతీయ జెండాను అవమానించే వారు భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని పేర్కొన్నారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా స్పందించారు. న్యూయార్క్‌లోని మ్యాడిసన్ స్క్వేర్ గార్డెన్‌లో జరిగిన సభకు ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ హాజరైన సందర్భంగా స్టేడియం వెలుపల చోటుచేసుకున్న ఘటనకు సంబంధించిన వీడియోను రిజిజు పంచుకున్నారు. "ఆర్ఎస్ఎస్‌ను లేదా బీజేపీని విమర్శించే హక్కు మీకు



ఉందని మేము ఎప్పటి నుంచో చెబుతున్నాం. కానీ మా దేశాన్ని అవమానించవద్దు. ఒక విషయం జాగ్రత్తగా వినండి. మా దేశాన్ని, జాతీయ జెండాను అవమానిస్తే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు" అని రిజిజు హెచ్చరించారు. వీడియోలో కనిపిస్తున్న దృశ్యాల ప్రకారం.. స్టేడియం వెలుపల కొందరు ఖలిస్థానీ మద్దతుదారులు నిరసనకు దిగారు. వారిలో ఓ వ్యక్తి భారత జాతీయ జెండాను కాలికి చుట్టుకుని అవమానించినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనపై సామాజిక మాధ్యమాల్లో పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తూ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిందితులను గుర్తించి చర్యలు చేపట్టాలని అమెరికా ప్రభుత్వాన్ని కోరారు. ఆర్ఎస్ఎస్ వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మోహన్ భాగవత్ ప్రసంగించారు. అమెరికాలో ఉంటూ ఉపాధి పొందుతున్న వారు తమ కర్మభూమి పట్ల బాధ్యతను నెరవేర్చడంతో పాటు మాతృభూమితో అనుబంధాన్ని కొనసాగించాలని పిలుపునిచ్చారు. వివిధ దేశాల్లోని హిందువులు బాధ్యతాయుత జీవనంతో ఆదర్శంగా నిలవాలని పేర్కొన్నారు.

# బాణాసంచా కర్మాగారంలో భారీ పేలుడు

**పేలుడు ధాటికి 11 మంది దుర్మరణం**

**యూపి సీఎం యోగి ఆదిత్యనాథ్ తీవ్ర దిగ్భ్రాంతి**

**లక్నో, ఆగస్ట్ 31:** ఉత్తర్‌ప్రదేశ్‌లోని కౌశాంబి జిల్లాలో సోమవారం మధ్యాహ్నం ఘోర అగ్ని ప్రమాదం జరిగింది. ఓ బాణసంచా కర్మాగారంలో భారీ పేలుడు సంభవించి 11 మంది మృతిచెందగా.. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ దారుణ ఘటన పిప్రి పోలీస్ స్టేషన్ పరిధి మనోరి గ్రామంలో చోటుచేసుకుంది. మృతులను ప్రియాంజలి (5), ప్రవీణ్ సింగ్ (13), జహన్వి (12), ఆదిత్య (12), ఆదిత్య (8), రవి (8), అంజు (32), జ్ఞాన్ సింగ్ (40), విక్రమ్ సరోజ్ (35), అన్ష్ (6), నానా (4)గా పోలీసులు గుర్తించారు. మృతులంతా ఫ్యాక్టరీ చుట్టుపక్కల నివసిస్తున్న వారేనని అధికారులు తెలిపారు. సోమవారం మధ్యాహ్నం వేళ బాణసంచా కర్మాగారంలో ఒక్కసారిగా భారీ పేలుడు సంభవించింది. ఈ పేలుడు స్థానికంగా బీభత్సం సృష్టించింది. భారీ శబ్దంతో పేలుడు జరగడంతో ఫ్యాక్టరీ చుట్టుపక్కల ఇళ్లని పూర్తిగా ధ్వంసమయ్యాయి. తీవ్రంగా గాయపడిన 16 మందిని ప్రయాగ్‌రాజ్‌లోని ఎస్ఆర్ఎన్ ఆస్పత్రికి తరలించగా.. 11 మంది చికిత్స పొందుతూ మరణించారని జిల్లా మేజిస్ట్రేట్ అమిత్ పాల్ తెలిపారు. మరో ఐదుగురికి చికిత్స అందుతోందని ఆయన వెల్లడించారు. ఈ ఘటనలో మొత్తం 18 మందికి పైగా గాయపడినట్లు అధికారులు



అనుమానిస్తున్నారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. శిథిలాలను తొలగిస్తూ వాటి కింద చిక్కుకున్న వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదంపై ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కౌశాంబి జిల్లాలో ప్రమాదం తీవ్రంగా బాధించింది. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. గాయపడిన వారికి సరైన వైద్య చికిత్స అందేలా చూడాలని, బాధిత కుటుంబాలకు అన్ని విధాలా సహాయం అందించాలని స్థానిక అధికారుల కు ఆదేశాలు జారీ చేశాం. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.2లక్షలు, గాయపడిన వారికి ఒక్కొక్కరికీ రూ.50 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించాలని ఆదేశాలు జారీ చేశాం.. అని ఎక్స్ వేదికగా పోస్టు చేశారు.

# రూ.36.49 కోట్లతో మత్స్య ప్రాజెక్టులు!

**మత్స్య రంగానికి కేంద్రం భారీ ప్రోత్సాహం**

**కొత్త ప్రాజెక్టులను ప్రారంభించనున్న మంత్రి రాజీవ్ రంజన్ సింగ్**

**మత్స్యకారుల జీవనోపాధి మెరుగుదలే లక్ష్యం**



**న్యూఢిల్లీ, ఆగస్టు 31 (సమయం న్యూస్):** దేశంలో మత్స్య రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు రూ. 36.49 కోట్ల విలువైన మత్స్య మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, పాడిపరిశ్రమ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ ప్రారంభించనున్నారు. మత్స్య ఉత్పత్తి నుంచి విక్రయాల వరకు సమగ్ర సరఫరా వ్యవస్థను పటిష్ఠం చేయడం, అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరచడం ఈ ప్రాజెక్టుల ప్రధాన ఉద్దేశం. వీటి ద్వారా మత్స్యకారులు, అనుబంధ రంగాల వారికి మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది.

# క్వాంటం భద్రతలో భారత్ ముందంజ!

**14 స్వదేశీ ఉత్పత్తులను ఆవిష్కరించిన సీ-డాట్**

**సైబర్ ముప్పుల నుంచి రక్షణే ప్రధాన లక్ష్యం**

**టెలికాం, రక్షణ రంగాలకు పటిష్ఠ రక్షణ కవచం**

**న్యూఢిల్లీ, ఆగస్టు 31 (సమయం న్యూస్):** దేశ సమాచార వ్యవస్థలను భవిష్యత్ క్వాంటం సైబర్ ముప్పుల నుంచి రక్షించే లక్ష్యంతో సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ టెలిమాటిక్స్ (సీ-డాట్) 14 స్వదేశీ క్వాంటం ఉత్పత్తులను ఆవిష్కరించింది. సీ-డాట్ 43వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా దేశ రాజధాని న్యూఢిల్లీలో వీటిని ఘనంగా విడుదల చేశారు. క్వాంటం కీ డిస్ట్రిబ్యూషన్, పోస్ట్-క్వాంటం క్రిప్టోగ్రఫీ వంటి అత్యాధునిక సాంకేతికతల ఆధారంగా వీటిని అభివృద్ధి చేశారు. క్యూ-అక్షయ్, క్యూ-సేతు, క్యూ-మహాసేతు, క్యూ-విక్రమ్, క్యూ-అమోఘ్, క్యూ-దర్శన్, క్యూ-వాయు, క్యూ-వజ్ర1000, క్యూ-పరాక్రమ్ తదితర ఉత్పత్తులు టెలికాం, రక్షణ, వైర్‌లెస్, ఆప్టికల్ రంగాల సమాచార వ్యవస్థలకు పటిష్ఠ భద్రత కల్పించనున్నాయి.

భవిష్యత్ క్వాంటం కంప్యూటర్ల వల్ల సంప్రదాయ ఎన్‌క్రిప్షన్ వ్యవస్థలకు ఎదురయ్యే సవాళ్లను సమర్థంగా తట్టుకునేలా ఈ సరికొత్త పరిష్కారాలను రూపొందించినట్లు కేంద్ర సమాచార శాఖ వెల్లడించింది. కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా, సహాయ మంత్రి చంద్రశేఖర్ పెమ్మసాని తదితరులు క్వాంటం ఉత్పత్తుల ప్రత్యేక పుస్తకాన్ని ఆవిష్కరించారు.

# భారత్ -బంగ్లా సరిహద్దుల్లో భారీగా బంగారం పట్టివేత

**కోల్‌కతా,ఆగస్ట్31:** భారత్-బంగ్లాదేశ్ సరిహద్దు సమీపంలో అక్రమంగా దాచి ఉంచిన బంగారాన్ని బీఎస్ఎఫ్ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. పశ్చిమబెంగాల్-బంగ్లాదేశ్ సరిహద్దులోని బన్‌పూర్ గ్రామంలో ఓ మహిళ కొంతకాలంగా అనుమానాస్పదంగా సంచరిస్తుండటాన్ని జవాన్లు గమనించారు. అనంతరం ఆమెపై నిఘా పెట్టి ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలోనే మహిళ ఇంట్లో సోదాలు చేయగా.. 15.6 కిలోల బంగారం బయటపడింది. దాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ పసిడి విలువ రూ.24కోట్లకు పైనే ఉంటుందని అధికారులు తెలిపారు. ఇంత పెద్ద మొత్తంలో బంగారం సరిహద్దుకు ఎలా చేరింది? దానిని ఎవరికి ఇవ్వడానికి మహిళ ప్రయత్నిస్తుందనే వివరాలు తెలుసుకోవడానికి దర్యాప్తు చేపట్టారు. దీని వెనుక అంతర్జాతీయ స్మగ్లింగ్ నెట్‌వర్క్ ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆ దిశగా ఆరా తీస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

# ఎస్సెల్ గ్రూపు దివాళ ప్రకటన

**భారీగా పడిపోయిన షేర్ల ధరలు**

**ముంబై,ఆగస్ట్31:** ఎస్సెల్ గ్రూప్ ఛైర్మన్ సుభాష్‌చంద్రకు చెందిన మీడియా కంపెనీ జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్ షేర్లు కుంగాయి. సోమవారం నాటి ట్రేడింగ్ సెషన్‌లో ఇంట్రాడేలో 14 శాతం మేర క్షీణించాయి. రూ.86.90 వద్ద కనిష్ఠాన్ని తాకాయి. ఆ తర్వాత కాస్త కోలుకున్నాయి. గడిచిన నాలుగు సెషన్లలో ఈ షేరు




విలువ 17 శాతం మేర పతనమై.. మూడు నెలల కనిష్ఠ స్థాయికి పడిపోయింది. ఎన్‌సీఎల్‌టీ తీర్పునకు వ్యతిరేకంగా కెనరా బ్యాంక్, యూనియన్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ అప్పీల్‌కు వెళతామని ప్రకటించిన నేపథ్యంలో ఈ షేర్లు కుంగాయి. ఎస్సెల్ గ్రూప్ వ్యవస్థాపకులు సుభాష్ చంద్ర వ్యక్తిగత దివాలా పరిష్కార ప్రణాళిక ఆమోదం పొందడంపై అసమ్మతి రుణదాతలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశారు. రుణదాతలు పేర్కొన్న రూ.22,006.57 కోట్ల ÷-లకెయిమ్‌లకు గానూ కేవలం రూ.6.5 కోట్లే చెల్లించేలా ఉన్న దివాలా ప్రణాళికకు ఎన్‌సీఎల్‌టీ ఆమోదం తెలపడంతో ఈ వివాదం మొదలైంది. దీనిపై బ్యాంకులు అభ్యంతరం వ్యక్తంచేస్తున్నాయి. ఆయన కుటుంబంతో సంబంధం ఉన్న 5 ఆర్థిక సంస్థల ఓట్లతోనే రుణ ప్రణాళిక ఆమోదం పొందినట్లు ఆరోపిస్తున్నాయి. దీంతో ఈ వ్యవహారంపై అప్పీల్‌కు వెళ్లనున్నట్లు ప్రకటించాయి. అయితే, ఈ రుణాలకు తాను వ్యక్తిగత హామీదారుగా మాత్రమే ఉన్నానని, అసలు క్లెయిమ్ రూ.3,992 కోట్లు మాత్రమేనని సుభాష్ చంద్ర పేర్కొనడం గమనార్హం.

# హోర్ముజ్‌లో తగ్గిన నౌకల రాకపోకలు!

- అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలతో స్తంభించిన కీలక జలసంధి
- మైన్లను ఢీకొన్న సూపర్‌ట్యాంకర్‌లో చెలరేగిన మంటలు
- బ్యారెల్‌కు 91 డాలర్లకు చేరిన ముడిచమురు ధర



**హోర్ముజ్, ఆగస్టు 31 (సమయం న్యూస్):** అమెరికా, ఇరాన్ దేశాల మధ్య సైనిక ఉద్రిక్తతలు మళ్లీ తీవ్రరూపం దాల్చడంతో కీలకమైన హోర్ముజ్ జలసంధిలో వాణిజ్య నౌకల రాకపోకలు భారీగా పడిపోయాయి. శనివారం కేవలం ఐదు సరుకు రవాణా నౌకలు మాత్రమే జలసంధిని దాటగా, ఆదివారం ఒక్క నౌక కూడా నమోదు కాలేదని నౌకల రాకపోకల పర్యవేక్షణ గణాంకాలు వెల్లడించాయి. అంతకుముందు వారాంతంలో దాదాపు 31 నౌకలు ఈ మార్గంలో ప్రయాణించాయి.

ఇదే సమయంలో జలసంధి దక్షిణ ప్రాంతంలో రెండు సముద్ర మైన్లను ఢీకొన్న ఒక సూపర్‌ట్యాంకర్‌లో భారీగా మంటలు చెలరేగి నిలిచిపోయినట్లు ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ ప్రకటించింది. ప్రమాదానికి గురైన నౌక వివరాలు, అందులోని సిబ్బంది పరిస్థితిపై ఇంకా పూర్తి సమాచారం వెల్లడి కాలేదు.

తాజా ఉద్రిక్తతల ప్రభావంతో అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు ఒక్కసారిగా పెరిగాయి. బ్రెంట్ రకం ముడిచమురు ధర బ్యారెల్‌కు 91 డాలర్లకు పైగా చేరింది. ప్రపంచ చమురు, ద్రవీకృత సహజవాయువు రవాణాలో హోర్ముజ్ జలసంధి అత్యంత కీలక మార్గం కావడంతో ప్రస్తుత పరిణామాలపై ప్రపంచ దేశాల్లో తీవ్ర ఆందోళన నెలకొంది.

# అమెరికా-ఇరాన్ మధ్య మళ్లీ సైనిక ఘర్షణ!

- లారక్ ద్వీపంపై అమెరికా దళాల దాడి
- జోర్డాన్‌లోని స్థావరాలపై ఇరాన్ క్షిపణుల వర్షం
- హోర్ముజ్‌లో సంక్షోభం, పెరిగిన చమురు ధరలు



**వాషింగ్టన్/టెహ్రాన్, ఆగస్టు 31 (సమయం న్యూస్):** నెల రోజుల విరామం అనంతరం అమెరికా, ఇరాన్ దేశాల మధ్య మళ్లీ ప్రత్యక్ష సైనిక ఘర్షణ చోటుచేసుకుంది. హోర్ముజ్ జలసంధిలోని ఇరాన్‌కు చెందిన లారక్ ద్వీపంలో ఉన్న రెండు రాకెట్ లాంచర్లపై అమెరికా బలగాలు దాడి చేశాయి. సముద్ర మైన్లతో కూడిన రాకెట్లను జలసంధిలోకి ప్రయోగించేందుకు ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ సన్నాహాలు చేస్తున్నట్లు గుర్తించడంతో ఈ పరిమిత దాడి చేపట్టినట్లు అమెరికా సైనిక కమాండ్ వెల్లడించింది.

దీనికి ప్రతీకారంగా జోర్డాన్‌లో అమెరికా దళాలు ఉన్న కింగ్ హుస్సేన్, అల్-అజ్రాక్ స్థావరాలను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. తమ గగనతలంలోకి ప్రవేశించిన ఎనిమిది క్షిపణులను జోర్డాన్ సైన్యం గాల్లోనే కూల్చివేసింది.

ఈ పరిణామాలతో పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ప్రపంచ చమురు, ద్రవీకృత సహజవాయువు రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధిలో భద్రతా సమస్యలు తలెత్తడంతో అంతర్జాతీయ విపణిలో ముడిచమురు ధరలు ఒక్కసారిగా పెరిగాయి.

# భగ్గుమన్న ముడిచమురు ధరలు!

- అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలతో 3 శాతానికి పైగా పెరుగుదల
- బ్యారెల్ బ్రెంట్ క్రూడ్ ధర 91 డాలర్లకు చేరిక
- హోర్ముజ్ సంక్షోభంతో భారత్ సహా పలు దేశాలపై భారం




**లండన్, ఆగస్టు 31 (సమయం న్యూస్):** అమెరికా, ఇరాన్ దేశాల మధ్య సైనిక ఉద్రిక్తతలు మళ్లీ తీవ్రరూపం దాల్చడంతో అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు ఒక్కసారిగా 3 శాతానికి పైగా ఎగిశాయి. బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు సుమారు 91 డాలర్లకు చేరగా, అమెరికా వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ ధర సైతం గణనీయంగా పెరిగింది.

ప్రపంచ చమురు రవాణాలో అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధిలో నౌకల రాకపోకలకు అంతరాయం ఏర్పడవచ్చన్న భయాలు ధరల పెరుగుదలకు ప్రధాన కారణంగా మారాయి. ఈ ఉద్రిక్తతలు మరింత తీవ్రమైతే ప్రపంచవ్యాప్తంగా ఇంధన సరఫరా వ్యవస్థ దెబ్బతినే ప్రమాదముందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. చమురు ధరల పెరుగుదలతో అంతర్జాతీయ ఆర్థిక విపణులపై ఒత్తిడి పెరిగింది. ప్రధానంగా ముడిచమురు దిగుమతులపై ఎక్కువగా ఆధారపడే భారత్ వంటి దేశాలపై ఈ ప్రభావం స్పష్టంగా పడే అవకాశముంది.

# క్లీన్ ఎనర్జీ రంగంలో పెట్టుబడుల జోరు!

**నవంబర్‌లో భారత్ రెన్యూవబుల్ ఎనర్జీ సమ్మిట్**

**2030 నాటికి 500 గిగావాట్ల హరిత విద్యుత్ లక్ష్యం**

**పరిశ్రమలను ఆహ్వానించిన తెలంగాణ సర్కారు**



**హైదరాబాద్, ఆగస్టు 31 (సమయం న్యూస్):** దేశంలో క్లీన్ ఎనర్జీ రంగంలో పెట్టుబడులు, ప్రాజెక్టుల అమలును మరింత వేగవంతం చేయాలని కేంద్ర నూతన, పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ పిలుపునిచ్చింది. నవంబర్ 2 నుంచి 5 వరకు న్యూఢిల్లీలోని భారత్ మండపంలో నిర్వహించనున్న 'భారత్ రెన్యూవబుల్ ఎనర్జీ సమ్మిట్ అండ్ ఎక్స్‌పోఉ2026' సదస్సు నేపథ్యంలో హైదరాబాద్‌లో మూడో ప్రాంతీయ సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సమావేశంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల ప్రభుత్వాలు, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొని సౌర విద్యుత్, బ్యాటరీ నిల్వ వ్యవస్థలు, గ్రీన్ హైడ్రోజన్, పరికరాల తయారీ రంగాల్లోని అపార పెట్టుబడి అవకాశాలను వివరించారు. 2030 నాటికి దేశంలో 500 గిగావాట్ల శిలాజేతర ఇంధన సామర్థ్యాన్ని సాధించడమే లక్ష్యమని, ఇప్పటికే దేశం 300 గిగావాట్ల మైలురాయిని అధిగమించిందని అధికారులు స్పష్టం చేశారు.

తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీఉ2025 ద్వారా పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి, తయారీ రంగాలను పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్నామని టీజీరెడ్కో మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ అలీ ఫరూఖీ తెలిపారు. రాష్ట్రంలో ఉన్న అనుకూలతలను సద్వినియోగం చేసుకుంటూ భారీగా పెట్టుబడులు పెట్టాలని పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు.

# విశ్రాంత జీవితాన్ని ఆనందంగా గడపాలి

## జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ రిటైర్డ్ ఉద్యోగులకు ఆత్మీయ వీడ్కోలు





**విజయనగరం , ఆగస్టు 31:** జిల్లా పోలీసుశాఖలో సుదీర్ఘకాలం విశిష్టమైన సేవలందించి, ఉద్యోగ విరమణ చేస్తున్న పోలీసు అధికారులకు జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా "ఆత్మీయ వీడ్కోలు" పలికారు. వీడ్కోలు పొందిన వారిలో ఎ.రమణ మూర్తి ఎస్ఐ, కమ్యూనికేషన్స్, విజయనగరం, ఎం. నరసింహరాజు ఏఎస్ఐ-64, విజయనగరం 2వ పట్టణ పోలీస్ స్టేషన్, కే.గోపాలం, ఏఆర్ఎస్ఐ-969, ఆర్మ్ద్ రిజర్వ్, విజయనగరం, ఎ. మహేశ్వరరావు ఏఆర్ హెచ్‌సీ-905, ఆర్మ్ద్ రిజర్వ్, విజయనగరం, కే. నారాయణ, ఏఆర్ హెచ్‌సీ-985, ఆర్మ్ద్ రిజర్వ్, విజయనగరం ఉన్నారు. ఈసందర్భంగా జిల్లా ఎస్పీ దామోదర్ మాట్లాడుతూ, ఉద్యోగ విరమణ చేస్తున్న పోలీసు అధికారులు జిల్లా పోలీసుశాఖలో సుదీర్ఘ కాలం విధులను అంకితభావంతో, నిబద్ధతతో నిర్వహించి, ప్రజా సేవలో విశిష్టమైన సేవలందించడం అభినందనీయమన్నారు. పోలీసుశాఖకు, ప్రజలకు మీరందించిన సేవలు అమూల్యమైనవని, అవి అందరికీ ఎల్లప్పుడూ స్మరణీయంగా నిలుస్తాయన్నారు. ఉద్యోగ జీవితంలో ఎన్నో సవాళ్లను అధిగమిస్తూ విధులు నిర్వహించిన ఉద్యోగులందరికీ జిల్లా ఎస్పీ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఉద్యోగ విరమణ అనంతరం శేష జీవితం సంపూర్ణ ఆరోగ్యం, ఆనందం, సుఖసంతోషాలు, ప్రశాంతతతో నిండిపోవాలని, కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా, ఆయురారోగ్యాలతో జీవించాలని జిల్లా ఎస్పీ ఆకాంక్షించారు. ఉద్యోగ విరమణ చేసిన పోలీసు అధికారులు, వారి కుటుంబ సభ్యులతో జిల్లా ఎస్పీ ఆప్యాయంగా మాట్లాడి, వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకొన్నారు. ప్రభుత్వం నుండి వచ్చే రిటైర్మెంట్ బెనిఫిట్స్ ను అనధికార సంస్థల్లో పెట్టుబడిగా పెట్టవద్దని, వడ్డీలకు ఆశపడి ఇతరులకు అప్పుగా ఇవ్వవద్దని, ఆర్థిక క్రమశిక్షణతో భవిష్యత్తు అవసరాలకు ప్రణాళికతో ఖర్చు చేయాలని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ సూచించారు. అనంతరం, ఉద్యోగ విరమణ చేసిన పోలీసు అధికారులు, వారి సతీమణులను జిల్లా ఎస్పీ శ్రీ ఎ.ఆర్.దామోదర్ గారు జిల్లా పోలీసుశాఖ తరుపున శాలువాలు, పుష్ప మాలలతో సత్కరించి, జ్ఞాపికలను, బహుమతులను ప్రధానం చేసి, ఘనంగా "ఆత్మీయ వీడ్కోలు" పలికారు. పోలీసు ఉద్యోగుల కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ తరుపున కూడా జిల్లా ఎస్పీ గారు చెక్ లను, జ్ఞాపికలను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ డీఎస్పీ ఈ.కోటిరెడ్డి, స్పెషల్ బ్రాంచ్ సిఐ ఏవీ లీలారావు, ఆర్ఐ గోపాల నాయుడు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పోలీసు కుటుంబాలు పాల్గొని, ఉద్యోగ విరమణ చేసిన పోలీసు అధికారులకు శుభాకాంక్షలు తెలిపారు.

# రహదారి భద్రతపై అవగాహన అవసరం విజయనగరం ట్రాఫిక్ సీఐ ఎస్.రాము

**విజయనగరం, ఆగస్టు 31:** విజయనగరం పట్టణం బాలాజీనగర్ లోని ఆదిత్య మహిళా కళాశాలలో ట్రాఫిక్ సిఐ ఎస్.రాము ఆధ్వర్యంలో విద్యార్థులకు రహదారి భద్రత, మహిళలు మరియు బాలికల భద్రత, సైబర్ నేరాల నియంత్రణ, మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలు తదితర అంశాలపై ఆగస్టు 31న అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ట్రాఫిక్ సీఐ ఎస్.రాము ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం నేరాల తీరు, నేరగాళ్లు అనుసరిస్తున్న విధానాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని, నేరాల నియంత్రణకు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. సైబర్ నేరగాళ్లు వివిధ రకాల ఆఫర్లు, లింకులు, ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, బెదిరింపుల ద్వారా ప్రజలను మోసగించి డబ్బులు దోచుకుంటున్నారని తెలిపారు. అపరిచిత వ్యక్తులు పంపే లింకులను క్లిక్ చేయవద్దని, ఓటీపీ, పిన్, సీవీవీ, పాస్‌వర్డ్ వంటి వ్యక్తిగత వివరాలను ఎవరికీ వెల్లడించవద్దని సూచించారు. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు. మహిళలు, బాలలను గౌరవించడం ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని, మన సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించాలని సూచించారు. మహిళల భద్రత కోసం రూపొందించిన దిశ యాప్ ను మొబైల్ ఫోన్లలో నిక్షిప్తం చేసుకోవాలని, అత్యవసర



పరిస్థితుల్లో యాప్‌లోని ూూ సదుపాయాన్ని వినియోగించి పోలీసుల సహాయం పొందవచ్చని తెలిపారు. యువత రహదారి భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని తల్లిదండ్రులకు సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపవద్దని, వాహనాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్ తదితర పత్రాలు సక్రమంగా ఉండేలా చూసుకోవాలని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని చెప్పారు. యువత తమ జీవితాలను నాశనం చేసే మత్తు పదార్థాలు, గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలు, బెట్టింగ్ యాప్‌లు, జూదానికి దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. చెడు వ్యసనాలకు బానిసై భవిష్యత్తును నాశనం చేసుకోకుండా, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధన కోసం కష్టపడి పనిచేయాలని సూచించారు. తల్లిదండ్రులు, గురువులు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుని సమాజానికి ఆదర్శంగా నిలవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, ఎఎస్ఐ నాగాదిత్య, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# దేశ రాజకీయాల్లో పవన్ కల్యాణ్ ది ప్రత్యేక ముద్ర



## సమష్టి కృషితో జనసేన బలోపేతం

**విజయనగరం, ఆగస్టు 31:** దేశ రాజకీయాల్లో ఉపముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ప్రత్యేక ముద్ర వేశారని జనసేన నేతలు పేర్కొన్నారు. పార్టీ ఆశయాలు, పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై విజయనగరం కార్పొరేషన్ పరిధిలోని 46వ డివిజన్‌కు చెందిన వైఎస్సార్‌సీపీకి చెందిన ముఖ్య మహిళా నాయకులు, 20 కుటుంబాల సభ్యులు జనసేన పార్టీలో చేరారు. జనసేన నాయకుడు అట్టాడ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు అవనాపు విక్రమ్, గురాన అయ్యలు వీరందరికీ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో గద్ది పద్మ, మునకాల ఆశ, దొంతల సంతోషి, గెద్ద రాజమ్మ, ఓల్లి సీతమ్మ, మహాదేవ విజయలక్ష్మి, వెంపడాపు భవాని, ఓల్లి సాదు, పిట్ట రమణి, కోరుకొండ సావిత్రి, బొట్ట లక్ష్మి తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా అవనాపు విక్రమ్, గురాన అయ్యలు మాట్లాడుతూ, దేశ రాజకీయాల్లో ప్రత్యేక ముద్ర వేసిన పవన్ కళ్యాణ్ గారి నాయకత్వంలో పనిచేసేందుకు మహిళలు, యువత ఉత్సాహంగా ముందుకు రావడం శుభపరిణామమన్నారు. పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా జనసైనికులంతా కలసికట్టుగా పనిచేసి పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు పత్తిగిల్లి వెంకటరావు, ఎన్నింటి నరసింగరావు, మండల లోకేష్, పొట్నూరు లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఫిర్యాదు మీది.. పరిష్కారం మాది

- జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్
- పీజీఆర్ఎస్ లో 35 అర్జీలు స్వీకరణ
- చట్టపరిధిలో చర్యలకు ఆదేశం

**విజయనగరం, ఆగస్టు 31:** ప్రజలు తమ సమస్యలపై పోలీసులను నిర్భయంగా సంప్రదించాలని జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. వాటిని చట్టపరిధిలో పరిష్కరించే బాధ్యతను తాము చేసుకుంటామని ఆయన చెప్పారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక" ను నిర్వహించారు. ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి, వారి సమస్యలను శ్రద్ధగా విని, సంబంధిత పోలీసు అధికారులతో ఫోనులో మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యలను సంబంధిత అధికారులకు వివరించారు. ఫిర్యాదుదారుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని, ఫిర్యాదుల పరిష్కారానికి చట్టపరిధిలో చర్యలు చేపట్టి, ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని అధికారులను జిల్లా ఎస్పీ దామోదర్ ఆదేశించారు. పబ్లిక్ గ్రీవియన్స్ రిడ్రసల్ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ 35 ఫిర్యాదులను స్వీకరించారు. ఆయా ఫిర్యాదుల్లో భూతగాదాలకు సంబంధించినవి 20, కుటుంబ కలహాలకు సంబంధించినవి 4, మోసాలకు పాల్పడినట్లు 3, ఇతర అంశాలకు సంబంధించినవి 8 ఫిర్యాదులు ఉన్నాయన్నారు. సంబంధిత అధికారులు ఫిర్యాదు అంశాలను పరిశీలించాలని, వాటి పూర్వాపరాలను విచారణ చేసి, ఫిర్యాదు అంశాలపై చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని సంబంధిత పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి వారం రోజుల్లో ఫిర్యాదుదారుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని, ఫిర్యాదులపై తీసుకున్న చర్యల



వివరాలను నివేదిక రూపంలో జిల్లాపోలీసు కార్యాలయానికి పంపాలని సంబంధిత పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ దామోదర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీసీఆర్బీ సిఐ కే.కుమార స్వామి, ఎస్బీ సిఐ ఎ.వి.లీలారావు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

## మొక్కలు పంపిణీ చేసిన మెగా అభిమానులు



**విజయనగరం, ఆగస్టు 30:** ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వారోత్సవాల్లో భాగంగా, విజయనగరం జిల్లా చిరంజీవి యువత, విజయనగరం జిల్లా మెగా యూత్ ఫోర్స్, అంజనీపుత్ర చిరంజీవి ప్రజా సేవా సంఘం, బ్లడ్ డోనర్స్ క్లబ్ ఆధ్వర్యంలో 12వ డివిజన్ ఇప్పిలి వీధిలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఇంటింటికి మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని జనసేన యువ నాయకులు,రాష్ట్ర మెగా యూత్ ఫోర్స్ ఎగ్జిక్యూటివ్ సభ్యులు కొయ్యాన లక్ష్మణ్ యాదవ్, విజయనగరం జిల్లా మెగా యూత్ ఫోర్స్ అధ్యక్షులు చెల్లూరి ముత్యాల నాయుడు ఇంటింటికీ మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విజయనగరం జిల్లా చిరంజీవి యువత అధ్యక్షులు, జనసేన పార్టీ సీనియర్ నాయకులు, ప్రముఖ సామాజిక కార్యకర్త త్యాడ రామకృష్ణారావు (బాలు) మాట్లాడుతూ... "పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత. ప్రతి ఇంట్లో ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించడం ద్వారా మన పరిసరాలను పచ్చగా మార్చడంతో పాటు భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చు. పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను కేవలం సంబరాలకే పరిమితం చేయకుండా, సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలుగా నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉంది. ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి, వాటిని సంరక్షించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి." అని అన్నారు. కార్యక్రమంలో జనసేన యువ నాయకులు లోకల్ బాయ్ ప్రసాద్, గొలగాన సురేంద్ర, జాడ గంగరాజు, కొయ్య హరి తదితరులు పాల్గొన్నారు.

# సంతలో గడ్డికి టెండర్ పాట జరిగేలా చూడాలి

## పీజీఆర్ఎస్ లో కాంగ్రెస్ నేతలు వినతి



**విజయనగరం, ఆగస్టు 31:** పార్వతీపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో ఉన్న పశువుల సంతలో గడ్డికి పాటకు టెండర్ జరిగేలా చర్యలు తీసుకోవాలని భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ డిసిసి జిల్లా అధ్యక్షులు వంగల దాలినాయుడు, లీగల్ సెల్ కన్వీనర్ కోలా కిరణ్ కుమార్, ఓబీసీ చైర్మన్ సిరిసిపల్లి సాయి శ్రీనివాస్, జిల్లా మహిళా అధ్యక్షురాలు గొట్టాపు రేణుక, పట్టణ అధ్యక్షులు బంకురు ప్రకాష్, ఏవో గంట మోహన్ రావు తదితరులు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి సీహెచ్ ప్రభావతితో మార్కెట్ యార్డ్ లో జరిగే సంత సమస్యలపై చర్చించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి గురువారం జరిగే వారపు సంతకు వచ్చే పశువులకు సరఫరా చేయాల్సిన గడ్డి టెండర్ గత ఏడేళ్లుగా గడ్డి టెండర్ జరగలేదన్నారు. పశువుల సంతలో సుమారు గత ఏడేళ్లుగా గడ్డి పాట నిర్వహించక పోవడంతో ఏటా సుమారు 15 లక్షల రూపాయలు వరకు ప్రభుత్వానికి నష్టం వాటిల్లుతుందన్నారు. అయితే సంతలో మాత్రం ప్రైవేటు వ్యక్తులచే గడ్డి సరఫరా జరుగుతోందన్నారు. ఒక చిన్న గడ్డి మోపుకే 500 రూపాయల వరకు వసూలు చేస్తున్నట్లు రైతులు తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. టెండర్ పిలవకుండా ప్రైవేటు వ్యక్తులచే గడ్డి సరఫరా చేయటం వెనుక అధికారుల ఆంతర్యం ఏమిటో అర్థం కావడం లేదన్నారు. సంతకు వచ్చే రైతులు, వ్యాపారులు సేద తీరేందుకు కనీస సౌకర్యం లేదన్నారు. సంత ప్రాంగణంలో ఉన్న రైతు గెస్ట్ హౌస్ ల కు నిత్యం తాళం వేసి ఉంటుందన్నారు. ఏ రోజు రైతులకు ఇచ్చే పాపాన పోలేదన్నారు. సంతకు తెచ్చే గొర్రెలు, పశువులకు కొన్నిటికి స్లిప్పులు ఇవ్వకుండానే ఆశీల పేరుతో అక్రమ వసూళ్లు జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. పశువుల ధరను బట్టి వసూళ్ల ధర పెరుగుతుందన్నారు. పశువులు ఉండేందుకు కూడా సరైన సదుపాయాలు లేవన్నారు. ఇదిలా ఉండగా పశువులను లారీల్లోకి ఎక్కించేందుకు దిమ్మ మామూలు పేరుతో భారీగా అక్రమ వసూలు జరుగుతున్నట్లు పలువురు తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఏఎంసీలో అధికారుల ఇష్టారాజ్యం నడుస్తోందని ఆరోపించారు. వారి ప్రాద్భలంతో ప్రైవేటు వ్యక్తుల పెత్తనం ఈ సంతలో సర్వసాధారణంగా కనిపిస్తోందన్నారు. నోరులేని మూగజీవాలకు కనీస సౌకర్యాలు కల్పన కరువన్నారు. వసూళ్లపై మాత్రమే దృష్టి సారించడం సరికాదన్నారు. పశువులకు, రైతులకు కనీస మౌలిక సౌకర్యాలు కల్పించాలన్నారు. ఇక్కడనుండి జరుగుతున్న పశువుల అక్రమ రవాణాను నివారించాలని కోరారు. ఈ సందర్భంగా వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్. మాధవరెడ్డి దృష్టికి పలు సమస్యలు తీసుకువెళ్లారు.

# పారిశుద్ధ్య కార్మికుల సేవలు అమూల్యం

## వారిని గౌరవించడం అందరి బాధ్యత. నూతన వస్త్రాలు బహుకరణ, సన్మానం



**విజయనగరం, ఆగస్టు 31:** ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వారోత్సవాల్లో భాగంగా, సోమవారం ఉదయం 42వ డివిజన్ కామాక్షి నగర్‌లోని మున్సిపల్ నడక మైదానంలో పారిశుద్ధ్య కార్మికులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. విజయనగరం జిల్లా చిరంజీవి యువత, విజయనగరం జిల్లా మెగా యూత్ ఫోర్స్, అంజనీపుత్ర చిరంజీవి ప్రజా సేవా సంఘం డ బ్లడ్ డోనర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని విజయనగరం జిల్లా చిరంజీవి యువత అధ్యక్షులు త్యాడ రామకృష్ణారావు (బాలు), విజయనగరం జిల్లా మెగా యూత్ ఫోర్స్ అధ్యక్షులు చెల్లూరి ముత్యాల నాయుడు, రాష్ట్ర మెగా యూత్ ఫోర్స్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు కొయ్యాన లక్ష్మణ్ యాదవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులను శాలువాలతో సత్కరించి, స్వీట్స్, కొత్త బట్టలు బహుకరించారు. ఈ సందర్భంగా త్యాడ రామకృష్ణారావు (బాలు) మాట్లాడుతూ. ప్రజల ఆరోగ్యం, పరిశుభ్రమైన పరిసరాల కోసం వారు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని, సమాజంలో పారిశుద్ధ్య కార్మికుల సేవలు ఎంతో విలువైనవని, వారి కృషిని ప్రతి ఒక్కరూ గౌరవించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కోట్ల సత్యనారాయణ, శంకరరావు. బీ. జగదీష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# మంధాన మరో మైలురాయి.. పరుగుల్లో నంబర్-2!

- సుజీ బేట్స్‌ను వెనక్కినెట్టిన భారత ఓపెనర్
- అంతర్జాతీయ క్రికెట్‌లో 10,756 పరుగులు
- అగ్రస్థానంలో మిథాలీ రాజ్
- మూడు ఫార్మాట్లలో మంధాన రికార్డుల జోరు
- వన్డేల్లోనూ వెయ్యి పరుగుల అరుదైన ఘనత








**దుబాయ్:** భారత స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన అంతర్జాతీయ మహిళల క్రికెట్‌లో మరో మైలురాయిని అందుకుంది. మూడు ఫార్మాట్లలో కలిపి అత్యధిక పరుగులు సాధించిన మహిళా క్రికెటర్ల జాబితాలో రెండో స్థానానికి చేరుకుంది. మహిళల ఆసియా కప్‌లో థాయ్‌లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో 19 పరుగులు చేసిన మంధాన.. న్యూజిలాండ్ దిగ్గజ క్రికెటర్ సుజీ బేట్స్‌ను వెనక్కినెట్టి ఈ ఘనత సాధించింది. అంతర్జాతీయ క్రికెట్‌లో మంధాన ఖాతాలో ప్రస్తుతం 10,756 పరుగులు ఉన్నాయి. భారత మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్ 10,868 పరుగులతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. మంధాన ఇప్పటివరకు 9 టెస్టుల్లో 788, 120 వన్డేల్లో 5,411, 172 టీ20ల్లో 4,557 పరుగులు సాధించింది. మూడు ఫార్మాట్లలో నిలకడగా రాణిస్తున్న మంధాన ఇటీవల లార్డ్స్ వేదికగా తన 300వ అంతర్జాతీయ మ్యాచ్ ఆడింది. ఆ మ్యాచ్‌లో అర్ధశతకంతో మెరిసింది. చారిత్రక లార్డ్స్ మైదానంలో జరిగిన మహిళల టెస్టులో అర్ధశతకం నమోదు చేసి ప్రత్యేక గుర్తింపు సాధించింది.

### వన్డేల్లోనూ రికార్డుల మోత

వన్డేల్లో ఒక క్యాలెండర్ ఏడాదిలో వెయ్యికి పైగా పరుగులు సాధించి మంధాన మరో అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకుంది. 18 ఇన్నింగ్స్‌ల్లో 59 సగటుతో 1,062 పరుగులు చేసి ఆస్ట్రేలియా దిగ్గజం బెలిండా క్లార్క్ పేరిట ఉన్న రికార్డును అధిగమించింది. క్లార్క్ 1997లో 970 పరుగులు సాధించగా.. దాదాపు 27 ఏళ్ల తర్వాత ఆ రికార్డును మంధాన తిరగరాసింది. ఒక క్యాలెండర్ ఏడాదిలో అత్యధిక వన్డే పరుగులు చేసిన మహిళల జాబితాలో మంధాన అగ్రస్థానంలో నిలవగా.. దక్షిణాఫ్రికా స్టార్ లారా వోల్వార్డ్ 882 పరుగులతో తర్వాతి స్థానాల్లో నిలిచింది. న్యూజిలాండ్‌కు చెందిన డెబ్బీ హాక్లీ 880, అమీ సాటర్త్‌వైట్ 853 పరుగులతో ఈ జాబితాలో చోటు సంపాదించారు. బ్యాటింగ్‌లో నిలకడగా రాణిస్తూ ఒక్కో రికార్డును తన ఖాతాలో వేసుకుంటున్న మంధాన.. ఇప్పుడు అంతర్జాతీయ పరుగుల్లో మిథాలీ రాజ్ రికార్డుకు మరింత చేరువైంది.



# వీనస్‌కు బిగ్ షాక్

## వరుసగా 15వ ఓటమి!

- యూఎస్ ఓపెన్ తొలిరౌండ్‌లోనే ఇంటిముఖం
- సోఫియా కెనిన్ చేతిలో వరుస సెట్లలో పరాజయం
- 46 ఏళ్ల వయసులో వైల్డ్‌కార్డ్‌తో బరిలోకి
- మెగా టోర్నీలో రికార్డు ప్రదర్శనకు నిరాశాజనక ముగింపు
- సింగిల్స్‌లో కొనసాగుతున్న ఓటముల పరంపర

**న్యూయార్క్:** ఒకప్పుడు మహిళల టెన్నిస్‌ను శాసించిన అమెరికా దిగ్గజం వీనస్ విలియమ్స్‌కు మరోసారి నిరాశే ఎదురైంది. యూఎస్ ఓపెన్--2026లో వైల్డ్‌కార్డ్‌తో బరిలోకి దిగిన 46 ఏళ్ల వీనస్ తొలి రౌండ్‌లోనే పరాజయం పాలైంది. అమెరికాకే చెందిన సోఫియా కెనిన్ చేతిలో వరుస సెట్లలో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించింది. దీంతో సింగిల్స్‌లో వీనస్‌కు ఇది వరుసగా 15వ ఓటమిగా నమోదైంది. ఇటీవల సిన్సినాటి ఓపెన్‌లోనూ ఆశించిన ఫలితం అందుకోలేకపోయిన వీనస్.. సొంతగడ్డపై జరుగుతున్న యూఎస్ ఓపెన్‌లోనైనా సత్తా చాటాలని భావించింది. అయితే తొలి రౌండ్‌లోనే కెనిన్ ఆమె ఆశలకు చెక్ పెట్టింది. తొలి సెట్‌లో వీనస్‌పై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన కెనిన్ 6-2తో సెట్‌ను సొంతం చేసుకుంది. రెండో సెట్‌లో వీనస్ గట్టిగా పోరాడినా కీలక సమయంలో కెనిన్ పైచేయి సాధించి మ్యాచ్‌ను ముగించింది. దీంతో కెనిన్ రెండో రౌండ్‌లోకి ప్రవేశించగా.. వీనస్ సింగిల్స్ ప్రయాణం తొలి రౌండ్‌లోనే ముగిసింది. సుదీర్ఘ కెరీర్‌లో ఎన్నో చిరస్మరణీయ విజయాలు సాధించిన వీనస్.. వయసును సైతం లెక్కచేయకుండా టెన్నిస్ కోర్టులో కొనసాగుతుండటం విశేషం. అయితే ఇటీవలి కాలంలో సింగిల్స్‌లో విజయాలు ఆమెకు దూరమవుతున్నాయి. తాజా పరాజయంతో వరుస ఓటముల సంఖ్య 15కు చేరింది. ఒకప్పుడు ప్రత్యర్థులకు చెమటలు పట్టించిన వీనస్.. ఇప్పుడు ఒక్క విజయం కోసం సుదీర్ఘంగా ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.




SOFIA KENIN

# హాకీ వరల్డ్ కప్ 2026 విజేత జర్మనీ

- స్పెయిన్‌పై 1-0తో విజయం!
- వరుసగా రెండో ప్రపంచకప్ టైటిల్
- నాలుగోసారి విశ్వవిజేతగా జర్మనీ
- పాకిస్థాన్ రికార్డు సమం
- అర్జెంటీనాకు కాంస్య పతకం



**వావ్రే, ఆగస్టు 30:** పురుషుల హాకీ ప్రపంచకప్--2026లో జర్మనీ విశ్వవిజేతగా నిలిచింది. బెల్జియంలోని వావ్రేలో ఆదివారం జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్లో స్పెయిన్‌ను 1-0 గోల్ తేడాతో ఓడించి టైటిల్‌ను నిలబెట్టుకుంది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన జర్మనీ మరోసారి తన ఆధిపత్యాన్ని చాటుతూ వరుసగా రెండో ప్రపంచకప్‌ను సొంతం చేసుకుంది. హోరాహోరీగా సాగిన ఫైనల్లో తొలి రెండు క్వార్టర్లలో ఇరు జట్లు గోల్ కోసం తీవ్రంగా ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. స్పెయిన్ ఎక్కువసేపు బంతిని తన ఆధీనంలో ఉంచుకోవడంతో పాటు పెనాల్టీ కార్నర్లు సంపాదించినా.. జర్మనీ పటిష్టమైన డిఫెన్స్‌ను ఛేదించలేకపోయింది.

### ఒక్క గోల్.. కప్ సొంతం

మూడో క్వార్టర్ చివర్లో మ్యాచ్ మలుపు తిరిగింది. 44వ నిమిషంలో జర్మనీకి లభించిన అవకాశాన్ని మైకేల్ స్ట్రుతాఫ్ గోల్‌గా మలచడంతో ఆ జట్టు 1-0 ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత స్పెయిన్ సమం చేసేందుకు తీవ్రంగా ప్రయత్నించినా జర్మనీ రక్షణ గోడను దాటలేకపోయింది. మ్యాచ్ ముగియడానికి నాలుగు నిమిషాల కంటే తక్కువ సమయం ఉండగా స్పెయిన్ గోల్‌కీపర్‌ను వెనక్కి తీసుకుని అదనపు అవుట్‌ఫీల్డ్ ఆటగాడిని రంగంలోకి దించింది. చివరి నిమిషాల్లో వరుస దాడులు చేసినా గోల్ మాత్రం దక్కలేదు. చివరి హూటర్ మోగేసరికి 1-0 ఆధిక్యాన్ని నిలబెట్టుకున్న జర్మనీ ప్రపంచకప్‌ను ముద్దాడింది.

### నాలుగోసారి విశ్వవిజేత

ఈ విజయంతో జర్మనీ నాలుగోసారి పురుషుల హాకీ ప్రపంచకప్‌ను కైవసం చేసుకుంది. గతంలో 2002, 2006, 2023లో టైటిళ్లు సాధించిన జర్మనీ.. 2026లో మరోసారి విజేతగా నిలిచి పాకిస్థాన్ పేరిట ఉన్న నాలుగు ప్రపంచకప్‌ల రికార్డును సమం చేసింది. పాకిస్థాన్ 1971, 1978, 1982, 1994లో విశ్వవిజేతగా నిలిచింది. మరోవైపు స్పెయిన్‌కు మూడో ప్రపంచకప్ ఫైనల్లోనూ నిరాశే ఎదురైంది. 1971, 1998లో రన్నరప్‌గా నిలిచిన ఆ జట్టు.. ఈసారి కూడా టైటిల్‌కు అడుగు దూరంలో నిలిచిపోయింది. ఫైనల్లో లభించిన నాలుగు పెనాల్టీ కార్నర్లను గోల్స్‌గా మలచుకోలేకపోవడం స్పెయిన్‌ను దెబ్బతీసింది. విజయం అనంతరం గోల్ హీరో మైకేల్ స్ట్రుతాఫ్ మాట్లాడుతూ జట్టు ప్రదర్శన పట్ల గర్వంగా ఉందని పేర్కొన్నాడు. యువ ఆటగాళ్లతో కూడిన తమ జట్టు సమష్టిగా పోరాడిందని తెలిపాడు. జర్మనీ కెప్టెన్ టామ్ గ్రాంబుష్ తమ తదుపరి లక్ష్యం లాస్ ఏంజెల్స్--2028 ఒలింపిక్స్ అని స్పష్టం చేశాడు.

### అర్జెంటీనాకు కాంస్యం

మూడో స్థానం కోసం జరిగిన పోరులో అర్జెంటీనా 2-1 గోల్స్ తేడాతో నెదర్లాండ్స్‌ను ఓడించి కాంస్య పతకాన్ని దక్కించుకుంది. ఈ ప్రపంచకప్‌లో మొత్తం 16 జట్లు తలపడగా 50 మ్యాచ్‌లు జరిగాయి. మొత్తం 248 గోల్స్ నమోదయ్యాయి. వాటిలో 136 ఫీల్డ్ గోల్స్, 97 పెనాల్టీ కార్నర్ గోల్స్, 15 పెనాల్టీ స్ట్రోక్ గోల్స్ ఉన్నాయి.

ఒక్క గోల్‌తో ఫైనల్‌ను శాసించిన జర్మనీ.. వరుసగా రెండోసారి కప్పును ముద్దాడి ప్రపంచ హాకీలో తన ఆధిపత్యాన్ని మరోసారి చాటుకుంది.



# ఫుట్‌బాల్‌కు మెస్సీ వీడ్కోలు..!

**బ్యూనస్ ఎయిర్స్, ఆగస్టు 31:** ప్రపంచంలోని ఫుట్‌బాల్ అభిమానులకు షాకింగ్ న్యూస్. అర్జెంటీనా స్టార్ లియోనల్ మెస్సీ వీడ్కోలు పలికాడు. తన ఆటతో కోట్లాదిమందిని మంత్రముగ్ధులను చేసిన ఈ దిగ్గజం సోమవారం అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు అల్విదా చెప్పేశాడు. ఇటీవలే తన తండ్రి మరణాంతరం మైదానంలోకి దిగిన ఈ ఫార్వర్డ్ ప్లేయర్ హఠాత్తుగా సంచలన నిర్ణయంతో అందర్నీ ఆశ్చర్యపరిచాడు. ప్రపంచ సాకర్‌లో ఓ శకం ముగిసింది. దాదాపు రెండు దశాబ్దాలకు పైగా తన ఆటతో అభిమానులను ఉర్రూతలూగించిన లియోనల్ మెస్సీ వీడ్కోలు పలికాడు. అర్జెంటీనా దిగ్గజ ఆటగాడిగా, వరల్డ్‌కప్ సాధించిన కెప్టెన్‌గా అతడు తన సుదీర్ఘ కెరీర్‌ను ముగించాడు. నాలుగేళ్ల క్రితం ఖతార్‌లో తన కెప్టెన్సీలో అర్జెంటీనాను ఫిఫా వరల్డ్‌కప్ విజేతగా నిలిపిన మెస్సీ.. ఈసారి కూడా గట్టిగానే ప్రయత్నించాడు. కానీ, ఫైనల్లో స్పెయిన్ కప్‌ను ఎగరేసుకుపోయింది. తన రిటైర్మెంట్ వార్తను ఇన్‌స్టాగ్రామ్ ద్వారా వెల్లడించాడీ మెస్సీ. జులై 20న ఫిఫా ఫైనల్లో స్పెయిన్ చేతిలో ఓటమి అనంతరం వీడ్కోలుపై ఆలోచించిన మెస్సీ ఎట్టకేలకు సోమవారం తన నిర్ణయాన్ని ప్రకటించాడు. 'ఫిఫా వరల్డ్‌కప్ ఫైనల్ ముగిసినప్పటి నుంచి వీడ్కోలు గురించి ఆలోచిస్తున్నా. అర్జెంటీనా ఫుట్‌బాల్ నుంచి నేను రిటైరవుతున్నాని ప్రతి ఒక్కరికి తెలియజేస్తున్నా. ఈ నిర్ణయం నన్నెంతగానో బాధిస్తోంది. అయినా సరే ఇదే సరైన సమయం అనిపించింది' అని మెస్సీ ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో మూడు పేజీల లేఖను పోస్ట్ చేశాడీ వెటరన్. 'అర్జెంటీనా ఫుట్‌బాల్ కోసం నేను సర్వం ధారపోశాను. గత కొన్ని ఏళ్లు సాధిస్తున్న విజయాలకు ముందు నుంచీ నేను ఎంతో చేశా. అర్జెంటీనా అభిమానులుగా మీరు సంతోషపడేందుకు, గర్వపడేందుకు తెలుపు, నీలం రంగు జెర్సీకోసం నేను ఎంతో పోరాడాను. అయితే.. ఇప్పుడు మరింత సమయం లేదు. విభిన్నమైన అధ్యాయాలు ముగియనున్నాయి. ఈ విషయం నన్ను చాలా బాధిస్తోంది. జాతీయ జట్టుకు ఆడడాన్ని నేను ఎంతో ఇష్టపడ్డాను. ఎల్లప్పుడూ ఇష్టపడతాను కూడా. ప్రతిభావంతులైన యువ ఆటగాళ్లు నా స్థానంలో రాబోతున్నారు'అని పేర్కొన్న మెస్సీ.. ఇకపై క్లబ్స్ తరఫున మైదానంలో ఫ్యాన్స్‌ను అలరించనున్నాడు. ప్రస్తుతానికి ఇంటర్ మియామికి ఆడుతున్న మెస్సీ తనను ఎంతో ప్రేమించి, మద్దతుగా నిలిచిన అర్జెంటీనా అభిమానులకు ధన్యవాదాలు తెలిపాడు.



# క్యాన్సర్ పుకార్లను తోసిపుచ్చిన నటి ప్రేమ

## సరైన జోడీ కుదిరితే రెండో పెళ్లికి ఓకే

దక్షిణాది సినీ పరిశ్రమలో ఒకప్పుడు స్టార్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగిన సీనియర్ నటి ప్రేమ.. తన వ్యక్తిగత జీవితంపై వచ్చిన పలు రూమర్లకు తాజాగా చెక్ పెట్టారు. ముఖ్యంగా తనకు క్యాన్సర్ వచ్చిందంటూ గతంలో జరిగిన ప్రచారంలో ఏమాత్రం నిజం లేదని స్పష్టం చేశారు. అదే సమయంలో తన రెండో వివాహంపై వస్తున్న వార్తలపైనా ఆమె ఆసక్తికరంగా స్పందించారు. జీవితాంతం తనకు తోడుగా ఉండే సరైన వ్యక్తి దొరికితే వయసుతో సంబంధం లేకుండా పెళ్లి చేసుకోవడానికి సిద్ధమేనని ఆమె పేర్కొన్నారు. కాగా, తెలుగు, కన్నడ చిత్ర పరిశ్రమల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ప్రేమ.. వెంకటేష్ సరసన నటించిన 'ధర్మచక్రం', కోడి రామకృష్ణ దర్శకత్వంలో తెరకెక్కిన 'దేవి' వంటి సినిమాల తో తెలుగు ప్రేక్షకులకు ఎంతో దగ్గరయ్యారు. గతంలో తనకు క్యాన్సర్ సోకిందంటూ కొన్ని వార్తలు ప్రచారంలోకి రావడంపై ప్రేమ తీవ్రంగా స్పందించారు. తాను న్యూజిలాండ్‌కు స్నేహితురాలిని కలవడానికి వెళ్లిన సమయంలో ఈ పుకార్లు వ్యాపించాయని తెలిపారు.క్యాన్సర్‌తో పోరాడి విజయం సాధించిన సోనాలి బింద్రే, మమతా మోహన్‌దాస్, గౌతమి వంటి నటీమణులను ఆమె గుర్తుచేసుకున్నారు. అయితే తనకు మాత్రం అలాంటి అనారోగ్య సమస్య ఏదీ లేదని స్పష్టం చేశారు. దేవుడి దయతో తాను సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నానని తెలిపారు. తన గురించి ఇలాంటి తప్పుడు వార్తలు రావడం బాధ కలిగించిందని చెప్పిన ప్రేమ.. ఆ సమయంలో తల్లిదండ్రుల అండ తనకు ఎంతో మానసిక బలాన్ని ఇచ్చిందని వెల్లడించారు. ప్రేమ వ్యక్తిగత జీవితంలో 2006లో వ్యాపారవేత్త జీవన్ అప్పాచ్చును వివాహం చేసుకున్నారు. అయితే కుటుంబ విభేదాల కారణంగా 2016లో వీరిద్దరూ చట్టబద్ధంగా విడాకులు తీసుకున్నారు. అప్పటి నుంచి ప్రేమ ఒంటరిగా ఉంటున్నారు. ఇటీవల ఆమె రెండో పెళ్లి చేసుకోబోతు న్నారంటూ వార్తలు రావడంతో ఈ అంశంపై కూడా ఆమె స్పందించారు. పెళ్లి అనేది పూర్తిగా తన వ్యక్తిగత నిర్ణయమని స్పష్టం చేశారు.

# షూటింగ్ సెట్‌లోకి అడుగుపెట్టిన రష్మిక

షూటింగ్‌లో గాయపడిన నటి రష్మిక కోలుకున్నారు. తిరిగి సెట్స్‌లోకి అడుగుపెట్టారు. ఈ సందర్భంగా ఇంట్లో విశ్రాంతి తీసుకున్న రోజులను గుర్తుచేసుకుంటూ ఓ పోస్ట్ పెట్టారు. 'తిరిగి షూట్‌కు వెళ్తున్నా. కానీ, ఈ క్షణాలను మాత్రం కచ్చితంగా మిస్ అవుతాను' అంటూ వరలక్ష్మి వ్రతం చేస్తోన్న ఫొటోలతో పాటు.. ఇంట్లో తాను ఆడుకున్న పజిల్ చిత్రాలను షేర్ చేశారు. ఎట్టకేలకు రష్మిక తిరిగి సెట్‌లోకి వెళ్లడంతో అభిమానులు ఆనందం వ్యక్తం చేశారు. ఆమెకు జాగ్రత్తలు చెబుతూ.. 'క్వీన్ ఈజ్ బ్యాక్' అంటూ నెట్టింట కామెంట్స్ చేస్తున్నారు. 'మైసా' చిత్రీకరణ సమయంలో రష్మిక గాయపడ్డారు. షూటింగ్‌లో భాగంగా ఓ పాటకు డ్యాన్స్ చేస్తుండగా తుంటి భాగంలో బలమైన గాయమైంది. ఆరు వారాలపాటు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు. దీంతో రష్మిక ఇంట్లో ఉండి తరచూ తన హెల్త్ అప్‌డేట్‌లతో పాటు, తాను చేస్తోన్న పనులను అభిమానులతో పంచుకుంటూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉన్నారు.







# 'హతః' టైటిల్‌తో కిరణ్ అబ్బవరం కొత్త సినిమా



యంగ్ హీరో కిరణ్ అబ్బవరం నటుడిగానే కాకుండా నిర్మాతగానూ తనదైన ముద్ర వేయడానికి సిద్ధమవుతున్నారు. ఇటీవల 'తిమ్మరాజుపల్లి టీవీ' చిత్రంతో నిర్మాణ రంగంలోకి అడుగుపెట్టిన ఆయన, పౌర్ణమి ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో కలిసి సంయుక్తంగా నిర్మిస్తున్న తన రెండో ప్రాజెక్ట్‌కు 'హతః' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేస్తూ అనౌన్స్‌మెంట్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఈ గ్లింప్స్‌ను మేకర్స్ చాలా విభిన్నంగా రూపొందించారు. చీకటి వాతావరణంలో ఒక డార్క్ బాక్స్‌లో ఉన్న పిల్లిని చూపిస్తూ, "ఈజ్ ద క్యాట్ అలైవ్ ఆర్..." (×ర్ ష్ట్రవ ఝ్ ఖశ్రీఱజవ శీతీ...) అనే సస్పెన్స్ క్యాప్షన్‌తో టైటిల్‌ను రివీల్ చేశారు. పిల్లి బతికే ఉందా లేదా అనే ప్రశ్నతో ప్రేక్షకుల్లో తీవ్ర క్యూరియాసిటీని పెంచే ప్రయత్నం చేశారు. ఇప్పటివరకు చూడని విభిన్నమైన కథాంశంతో, కొత్త జానర్‌లో ఈ సినిమా రూపొందుతున్నట్లు సమాచారం. ఈ చిత్రానికి అనుష్ గోరాక్ రచన, దర్శకత్వంతో పాటు సినిమాటోగ్రఫీ బాధ్యతలను కూడా నిర్వహిస్తున్నారు. కుష్లు మద్దాల, రెహ్మాన్, నమ్రిత ఎంవీ, తనూజ పుట్టస్వామి తదితరులు ముఖ్య పాత్రల్లో నటిస్తుండగా, జెసిన్ జార్జ్ సంగీతాన్ని, అఖిల్ చక్రవర్తి ఎడిటింగ్ బాధ్యతలను అందిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలను మేకర్స్ త్వరలోనే వెల్లడించనున్నారు.

# విడుదలకు రెడీ అవుతున్న సర్దార్-2





కోలీవుడ్ స్టార్ హీరో కార్తీ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల్లో 'సర్దార్ 2' ఒకటి. పీఎస్ మిత్రన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా.. గతంలో ప్రేక్షకులను ఆకట్టుకున్న 'సర్దార్' చిత్రానికి సీక్వెల్‌గా రూపొందుతోంది. మొదటి భాగంలో ఏజెంట్‌గా కార్తీ చేసిన యాక్షన్, డిఫరెంట్ గెటప్‌లు ప్రేక్షకులను మెప్పించడంతో.. సీక్వెల్‌పై కూడా మంచి అంచనాలు నెలకొన్నాయి. తాజాగా 'సర్దార్ 2'కు సంబంధించి మేకర్స్ కీలక అప్డేట్ ఇచ్చారు. సినిమా తెలుగు వెర్షన్‌కు సంబంధించిన ట్రైలర్, ఆడియోను విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. దీంతో కార్తీ అభిమానుల్లో సందడి మొదలైంది. 'సర్దార్ 2'పై ఇప్పటికే ప్రేక్షకుల్లో ఆసక్తి ఉంది. ఇప్పుడు తెలుగు ట్రైలర్ విడుదల కానుండటంతో సినిమాకు సంబంధించిన కథ, కార్తీ పాత్ర, యాక్షన్ సన్నివేశాలు, విలన్ క్యారెక్టర్‌పై మరింత క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.ముఖ్యంగా మొదటి భాగంలో కార్తీ ఏజెంట్ పాత్రకు మంచి స్పందన రావడంతో.. రెండో భాగంలో ఆ పాత్రను దర్శకుడు ఏ స్థాయిలో చూపించారనే విషయంపై అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ట్రైలర్ విడుదల తర్వాత సినిమాపై బజ్ మరింత పెరుగుతుందా లేదా అనేది ఆసక్తికరంగా మారింది. 'సర్దార్'లో కార్తీ విభిన్న గెటప్‌లలో కనిపిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ముఖ్యంగా ఏజెంట్ పాత్ర సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇప్పుడు అదే పాత్రను కొనసాగిస్తూ 'సర్దార్ 2'తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. సీక్వెల్‌లో కథ మరింత విస్తృతంగా ఉండబోతుందని, యాక్షన్‌తో పాటు స్పై థ్రిల్లర్ అంశాలకు ప్రాధాన్యత ఉంటుందని తెలుస్తోంది. మొదటి భాగంతో పోలిస్తే రెండో భాగాన్ని మరింత భారీ స్థాయిలో తెరకెక్కించినట్లు చిత్ర బృందం చెబుతోంది. ఈ సినిమాలో విలన్ పాత్రలో విలక్షణ నటుడు ఎస్‌జే సూర్య నటిస్తున్నారు. ఆయనకు ఉన్న ప్రత్యేకమైన నటన శైలికి తగ్గట్టుగా పవర్‌ఫుల్ క్యారెక్టర్‌ను డిజైన్ చేసినట్లు సమాచారం.కార్తీ, ఎస్‌జే సూర్య మధ్య జరిగే పోరాటం సినిమాకు కీలకంగా ఉండబోతుందని టాక్. ఇప్పటికే వీరిద్దరి కాంబినేషన్‌పై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. ట్రైలర్‌లో విలన్ పాత్రను ఎంతవరకు రివీల్ చేస్తారనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.'సర్దార్ 2'లో మాళవిక మోహనన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. కార్తీతో ఆమె కాంబినేషన్ సినిమాకు మరో ఆకర్షణగా నిలవనుంది. యాక్షన్, థ్రిల్లర్ అంశాలతో పాటు సినిమాలో ఎమోషనల్, కమర్షియల్ ఎలిమెంట్స్ కూడా ఉండనున్నట్లు తెలుస్తోంది. 'సర్దార్ 2' చిత్రాన్ని 2026 సెప్టెంబర్ 10న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

# శ్రీవిష్ణు కొత్త మూవీ ప్రారంభం

వైవిధ్యమైన కథలు, వినోదాత్మక చిత్రాలతో ప్రేక్షకులను అలరించే కథానాయకుడు శ్రీవిష్ణు. ఇప్పుడాయన మరో ఆసక్తికరమైన కథను ప్రేక్షకులకు అందించేందుకు సిద్ధమయ్యారు. సన్నీ సంజయ్ దర్శకత్వంలో శ్రీవిష్ణు నటిస్తున్న కొత్త సినిమా ప్రకటన వచ్చింది. సితార ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై హారిక సూర్యదేవర నిర్మిస్తున్న కొత్త మూవీ షూటింగ్ సోమవారం మొదలైంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ చిత్ర బృందం గ్లింప్స్‌ను పంచుకుంది. 'ఇది మనందరి కథ. అందిలాగే నా కథ' అంటూ శ్రీ విష్ణు తన కథను చెబుతున్న విధానం అలరిస్తోంది. 'మరుగేలరా.. ఓ రాఘవ' అంటూ నేపథ్యంలో త్యాగరాజ కృతి వినిపించారు.





Printed, Published by **Mohammed Murthuza.** Printed at NUTAN OFFSET PRINTERS, R.S.NO. 434, PLOT NO 16,17, AUTO NAGAR, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520007. Ediotr: **MOHAMMED MURTHUZA,** PRGI No:APTEL/26/A3949, www.samayam.net Mobile No. **7036644111, 9490140565**